


రామతీర్థం పురవీధుల్లో భక్తుల నడుమ సాగుతున్న రథం

హరహర మహాదేవ..!

- వేడుకగా రామలింగేశ్వరుడి రథోత్సవం
- శివనామ స్మరణతో మార్మోగిన రామతీర్థం
- నేడు ఆదిదంపతుల కల్యాణం

విడవలూరు, జూలై 3 : 'హరహర మహాదేవ శంభోశంకర.. శంభో శివ శంభో..' అంటూ భక్తుల నామస్మరణల నడుమ శ్రీ కామాక్షీదేవి సమేత రామలింగేశ్వర స్వామివారు రథంపై తిరుగుతూ కటాక్షించారు. రామతీర్థంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆదిదంపతుల రథోత్సవ వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో గ్రామం కిక్కిరిసి పోయింది. తొలుత ఆలయ అర్చకులు శివపార్వతులకు ప్రత్యేక పూజల అనంతరం రథ వాస్తుహోమాలు, ప్రధాంగ వళి, రథశుద్ధి, రథదేవతా రాధన, రథబలి వంటి కార్యక్రమాలు నిర్వహించా రు. మానవుని ఆత్మలో పరమాత్ముడు నిలిచి ఉండాలనే సూచికగా అత్యంత శోభాయమానంగా అలంకరించిన జంగమాలయం (రథం)పై స్వామిఅమ్మవార్లు ఆశీనులై భక్తుల వద్దకు తరలివచ్చారు. ఇన్‌చార్జి తహసీల్దారు భానుప్రకాష్, కొడవలూరు సీఐ సుబ్బారావు, ఈవో రామకృష్ణ, శంభుని కాపులు, టీడీపీ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, కోడిమేర్ల శేషయ్య, కుడుముల మల్లికార్జున, ఎస్‌ఐ రాజులు, వీఆర్వో నరసయ్య తదితరులు రథాన్ని లాగి ప్రారంభించారు. మేళతాళాలు, తీన్‌మార్, తెనాలి బ్యాండ్ నడుమ భక్తుల శివనామస్మరణలతో రథం రామతీర్థం, పాతూరు పురవీధుల్లో సాగింది. వీధుల్లో భక్తులు ముగ్గులు వేసి, టెంకాయలు కొట్టి హారతులు పట్టారు. సాయంత్రం శంభుని కాపుల ఆధ్వర్యంలో స్వామి వారికి పూలంగి సేవ జరిగింది.

● ఆకట్టుకున్న కళాకృతులు

శంభుని కాపులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బియ్యం, ఉప్పు, పండ్లతో కూడిన దేవుని కళాకృతులు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నిమ్మ, యాపిల్, జామ, ద్రాక్ష, ఇలా వివిధ రకాలు పండ్లతో దేవుని ప్రతిమలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. సాంస్కృతిక కార్యక్రమాలూ భక్తులను అలరించాయి. కాగా, గురువారం రాత్రి స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరగనుంది. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదిదంపతులకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

ఆయన పేరుకే చిరుద్యోగి. మార్కెటింగ్ శాఖలో ఒక జూనియర్ అసిస్టెంట్ స్థాయి కలిగిన ప్రభుత్వ ఎంప్లాయి. కానీ చేసేవన్నీ పెద్ద పనులే. వైసీపీ హయాంలో ఓ మాజీ మంత్రికి వ్యక్తిగత సహాయకుడిగా వ్యవహరించిన ఆయన సాగించిన దందాలు అన్నీ ఇన్నీ కావు. సర్వేపల్లి కాలువ వెంబడి ఉన్న ఆక్రమణదారుల నుంచి వసూలు మొదలు క్వార్ట్జ్ లీజుదారుల వద్ద కప్పం వసూలు చేసే వరకూ అన్నీ తానై వ్యవహరించారు. నెల్లూరులోని మూలాపేట ప్రాంతంలో అనుమతులు లేకుండా రూ.కోట్లు విలువైన ఓ కల్యాణ మండపాన్నే నిర్మిస్తున్నారంటేనే ఆ ఉద్యోగి స్థాయి అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు సెలవులు పెట్టి మరీ స్వామిభక్తిని చాటుకుంటున్న ఆయన వ్యవహారంపై రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ ఆరా తీశారు. సెలవులు ముగిసినా విధుల్లో చేరకపోవడంపై సదరు ఉద్యోగికి మెమో జారీ చేశారు.

సేవలు 'వ్యక్తిగత'ం

చేసేవి అనంతం!


వివాదాస్పదంగా ఓ మాజీ మంత్రి పీఏ తీరు

- 'కోడ్'లో సరెండర్ చేసినా వీడని స్వామిభక్తి
- తప్పుడు పత్రాలతో మెడికల్ లీవ్
- ఆపై మాజీ మంత్రి కోసం ఎన్నికల ప్రచారం
- నాడు పట్టించుకోని అధికారులు.. నేడు చర్యలకు సిద్ధం
- నోటీసులు జారీ చేసిన మార్కెటింగ్ శాఖ

నెల్లూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో ఓ మాజీ ప్రజాప్రతినిధికి ఆర్థిక వ్యవహారాల్లో అన్నీ తానై వ్యవహరించిన మార్కెటింగ్ శాఖలోని ఉద్యోగి ఎన్నికల సమయంలోనూ స్వామి భక్తిని వీడలేదు. కోడ్ అమల్లోకి రాగానే ప్రజాప్రతి నిధుల వద్దనున్న ప్రభుత్వ ఉద్యోగులను సరెండర్ చేశారు. కలెక్టర్ ఆదేశాలతో మార్కెటింగ్ శాఖలో రిపోర్టు చేసుకున్న సదరు ఉద్యోగి ఆ వెంటనే మెడికల్ లీవ్ అంటూ సెలవులో వెళ్లిపోయారు. సాధారణంగా మెడికల్ లీవ్‌ను నెల రోజులు మంజూరు చేస్తారు. కానీ ఈ ఉద్యోగి దాదాపు మూడు నెలలకుపైగా విధుల్లోకి రాలేదు. మరోవైపు మెడికల్ లీవ్ మంజూరు చేయకుండానే సదరు ఉద్యోగి సెలవుల్లోకి వెళ్లిపోవడం గమనార్హం. సదరు ఉద్యోగి విధుల్లో ఉన్నట్లే భావించిన కలెక్టరేట్ సిబ్బంది ఎన్నికల విధులు అప్పగించారు. ఇందుకు సంబంధించిన పత్రాన్ని కూడా సదరు ఉద్యోగి తీసుకున్నారు. కానీ ఆ తర్వాత ఆయనకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వడం గమనార్హం.

● స్వామిభక్తి చాటుకున్న ఉద్యోగి

మెడికల్ లీవ్ పెట్టగానే దానిని నిబంధనల ప్రకారం మెడికల్ బోర్డుకు రెఫర్ చేస్తారు. డాక్టర్ల బృందం సదరు డాక్యుమెంట్లను పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తుంది. కానీ ఈ ఉద్యోగి విషయంలో అలా జరగలేదు. ఇంతవరకూ మెడికల్ బోర్డు నుంచి ఎటువంటి క్లియరెన్స్ రాలేదు. అయితే ఈ ఉద్యోగి మెడికల్ లీవ్ పేరుతో రాజకీయ ప్రచారంలో పాల్గొన్నారని చెప్పుకుంటున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు కూడా గతంలో సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. ఎన్నికలు ముగిశాకైనా సదరు ఉద్యోగిలో మార్పు వచ్చిందా.. అంటే అదీనూ లేదు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమర్పించి విధుల్లో చేరిన ఆయన మళ్లీ క్యాజువల్ లీవ్ పేరుతో సెలవుపై వెళ్లారు.



● మంత్రి నారాయణ ఆరా

క్యాజువల్ లీవ్ ముగిసినా విధుల్లోకి చేరలేదు. తాను పనిచేసిన మాజీ ప్రతినిధి కార్యాలయంలో కూర్చొని మళ్లీ రాజకీయ కార్యకలాపాలు ప్రారంభించారని పలువురు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ విషయం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ దృష్టికి వచ్చింది. దీంతో ఆయన సదరు ఉద్యోగి తీరుపై ఆరా తీయగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఆ ఉద్యోగికి ఆపరేషన్ అవసరమంటూ మెడికల్ సర్టిఫికెట్ ఇచ్చింది ఆ మాజీ మంత్రి తమ్ముడేనని తేలినట్లు సమాచారం. ఈ క్రమంలో సదరు ఉద్యోగిపై నిబంధనల ప్రకారం చర్యలకు మార్కెటింగ్ శాఖ అధికారులు కదిలారు. సెలవు ముగిసినా విధుల్లోకి చేరకపోవడంతో మెమో కూడా జారీ చేశారు. అలానే మెడికల్ బోర్డు నుంచి కూడా ఎగ్జామి నేషన్ సర్టిఫి కెట్ కోసం ప్రయ త్నాలు చేస్తున్నారు. సదరు ఉద్యోగిని స్క్రీనింగ్ చేస్తే ఎటువంటి ఆపరేషన్ చేయించుకున్నారో అర్థమవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ వ్యవహారం ఇప్పుడు ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఉద్యోగికి మెమో ఇచ్చాం

మా శాఖలో పని చేస్తున్న ఉద్యోగి మెడికల్ లీవ్ పెట్టారు. దీనిని మెడికల్ బోర్డుకు పంపాం. ఇంకా ఎటువంటి క్లియరెన్స్ రాలేదు. మెడికల్ లీవ్ పత్రాలు తప్పుడువని తేలితే సదరు ఉద్యోగిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం. మెడికల్ లీవ్ ముగిశాక మళ్లీ విధుల్లోకి వచ్చి సీఎల్ పెట్టి వెళ్లారు. గడువు ముగిసినా మళ్లీ విధుల్లోకి రాకపోవడంతో మెమో జారీ చేశాం.

- నవీన్, నెల్లూరు ఏఎంసీ కార్యదర్శి

మాజీ మంత్రి పూర్వ పీఏపై ఫిర్యాదు

నెల్లూరు(క్రైం): మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ పీఏగా పనిచేసిన అప్సర్‌పై పలువురు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల్లూరులోని కూరగాయల మార్కెట్‌లో దుకాణం ఇప్పిస్తానని మూలాపేటకు చెందిన జెండా గోవర్ధన్, వేణుగోపాల్, శంకర్‌రావు, శరత్‌కుమార్ వద్ద అప్సర్ రూ.4 లక్షలు తీసుకున్నారు. అయితే వారికి దుకాణం ఇప్పించకపోగా సమాధానం చెప్పలేదు. బాధితులు పలు మార్లు అప్సర్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించినా వీలు కాలేదు. దీంతో వారు బుధవారం చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చిన్న బజారు పోలీసులు వివరణ ఇచ్చేందుకు స్పందించలేదు. వైసీపీ ప్రభుత్వంలో రాజకీయ అంశాలపై కేసులు నమోదు చేసిన పోలీసులు, ప్రస్తుతం బాధితులు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.

సమస్యలు అనేకం..

పరిష్కరిస్తేనే ఆనందం!

- వైసీపీ పాలనలో పడకేసిన ప్రగతి
- ఐదేళ్లలో పెరిగిపోయిన భూ సమస్యలు
- బలవంతంగా పేదల అసైన్డ్ భూముల దోపిడీ
- భూసేకరణ జరగక ప్రధాన ప్రాజెక్టులకు బ్రేక్
- కలగానే మిగిలిపోయిన ఇళ్ల నిర్మాణాలు
- నేడు నూతన కలెక్టర్ ఆనంద్ బాధ్యతల స్వీకరణ



బుధవారం రాత్రి నెల్లూరు ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్న నూతన కలెక్టర్ ఓ ఆనంద్‌కు స్వాగతం పలుకుతున్న ఆర్డీవో మలోల

నెల్లూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు భూ సమస్యలు.. మరోవైపు అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలు.. కదలనంటున్న ఇళ్ల నిర్మాణాలు.. ప్రభుత్వ కార్యాలయాల్లో పేరుకుపోయిన ఫైళ్లు.. భూసేకరణ జరగక ముందుకు కదలని కీలకమైన ప్రాజెక్టులు.. ఇలా జిల్లా అనేక సమస్యలతో సతమతమవుతోంది. గడిచిన ఐదేళ్లలో వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారు. ఆ పార్టీ నేతల దోపిడీని తట్టుకోలేకపోయారు. తమ సమస్యలపై నోరు విప్పలేక లోలోన కుమిలిపోయారు. తమకు జరిగిన అన్యాయంపై ఎన్నికల్లో ఓటుతో గట్టిగా సమాధానం చెప్పారు. ఈ క్రమంలో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. పాలనా సౌలభ్యం, ఇతరత్రా కారణాల దృష్ట్యా అధికారుల బదిలీలు వేగంగా జరిగిపోతున్నాయి. ప్రస్తుత కలెక్టర్ హరినారాయణన్ బదిలీ అవగా, ఆయన స్థానంలో విశాఖ నుంచి ఓ ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన జిల్లా పాలనాధికారిగా గురువారం బాధ్యతలు చేపట్టబోతున్నారు. గూడూరు సబ్ కలెక్టర్‌గా పని చేసిన ఆయనకు గత అనుభవాలు పాఠాలు నేర్పుతుండగా, అనేక సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. వీటన్నిటిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

● భూ సమస్యలతో సతమతం..

జిల్లాను భూ సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. గడిచిన ఐదేళ్లలో లిటిగేషన్లు ఎక్కువైపోయాయి. అందులోనూ భూసర్వేను అస్తవ్యస్తంగా నిర్వహించడంతో సమస్యలు మరింత ముదిరిపోయాయి. భూములకు విలువ పెరగడంతో ప్రభుత్వ స్థలాలకు రక్షణ లేకుండా పోతోంది. చివరకు పట్టా భూముల రికార్డులు కూడా మార్చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రికార్డుల ట్యాంపరింగ్ మూలంగా దాదాపుగా ప్రతి మండలంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. దాదాపు అరవై మంది వరకు తహసీల్దార్ స్థాయి నుంచి వీఆర్వో స్థాయి వరకు ఉద్యోగులు సస్పెండ్ అయ్యారంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అయినా కొందరు ఉద్యోగుల్లో మార్పు రావడం లేదు. అదే సమయంలో గతేడాది జరిగిన అసైన్‌మెంట్ భూముల పంపిణీలో కూడా భారీ అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. అనర్హులకు ప్రభుత్వ భూములను పంచి పెట్టడమే కాకుండా అర్హుల నుంచి భూములను బలవంతంగా లాక్కున్నారన్న ఫిర్యాదులు అందుతున్నాయి. అసైన్‌మెంట్ భూముల పంపిణీ, ఇరవై సంవత్సరాలు నిండిన వారికి పట్టా హక్కులు ఇచ్చిన ప్రక్రియలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాల్సిన అవసరముంది.

● కదలని ప్రాజెక్టులు

జిల్లాలోని కీలకమైన ప్రాజెక్టులన్నీ పడకేశాయి. భూసేకరణ చేయడంలో వైఫల్యం కారణంగా ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. సోమశిల హైలెవల్ కెనాల్, బండేపల్లి-డేగపూడి కెనాల్, నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ వంటి ప్రాజెక్టులు ఈ కోవలోకి వస్తాయి. భూసేకరణలో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించేకపోతున్నారు.

● ఇక పేదలకు సొంతింటి కల కల్లగానే మిగిలిపోయింది. ఐదేళ్ల పాటు ఇళ్ల నిర్మాణాల పేరుతో దోచుకుతిన్నారు తప్ప పేదలకు మాత్రం ఇళ్లు నిర్మించి ఇవ్వలేదు. రూ.వందల కోట్ల ప్రజాధనం ఈ హౌసింగ్ పథకంలో దుర్వినియోగమైంది. జిల్లాలోని లేఅవుట్లలో దాదాపు 90 వేల ఇళ్లను మంజూరు చేయగా పూర్తి చేసింది 22 వేలు మాత్రమే. నివాసానికి పనికిరాని విధంగా ఇళ్లు నిర్మించి వాటిని పూర్తి చేసినట్లు లెక్కలు చూపిస్తున్నారు. హౌసింగ్‌లో జరిగిన కుంభకోణంపై విచారణ జరిపించడంతో పాటు పేదలకు ఇళ్లు నిర్మించాల్సి ఉంది.

● ఇరిగేషన్ శాఖ గురించి ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిది. కాలువల్లో పూడిక తీయకుండానే బిల్లులు తినేశారు. గడిచిన ఐదేళ్లలో రూ.వందల కోట్లతో కాలువల్లో పనులు చేసినట్లు రికార్డులు చూపిస్తున్నారు. కానీ సాగు ప్రారంభమయ్యాక మాత్రం నీరు అందక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఇలా ప్రధానంగా పరిష్కరించాల్సిన సమస్యలన్నింటిపై నూతన కలెక్టర్ ఓ ఆనంద్ దృష్టి పెట్టాలని జిల్లావాసులు కోరుకుంటున్నారు.

కడలిలో అలజడి



కావలి మండలం తుమ్మలపెంట తీరంలోని సముద్రంలో అలల ఉధృతికి పెద్ద రింగ్ వల కొట్టుకుపోయింది. తుమ్మలపెంటకు చెందిన కాటంగారి పోలయ్య, మరో 24 మంది మత్స్యకారుల భాగస్వామ్యంతో చేపల కోసం ఓ రింగ్ వలను సముద్రంలో వదిలారు. బుధవారం ఉదయం మత్స్యకారులకు సముద్రంలో వల కనిపించకపోవడంతో బోట్లలో ముమ్మరంగా గాలించారు. సుమారు 6 కి.మీ దూరంలోని కొత్తసత్రం తీరం వద్దకు కొట్టుకు వచ్చి ఇసుక మేటలో కూరుకుపోయి దెబ్బతిన్న వలను మత్స్యకారులు గుర్తించారు. అలల ఉధృతికి వల పూర్తిగా పనికిరాకుండా పోయిందని వారు వాపోయారు. సుమారు రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని గగ్గోలు పెడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి తమను ఆదుకోవాలని గంగపుత్రులు వేడుకుంటున్నారు.

- కావలి రూరల్

- జిల్లాలో 79 పీఏసీఎస్‌లు
- సొసైటీల్లో ఆఫీస్ ఇన్‌చార్జుల నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- జిల్లా సహకార అధికారులకు బాధ్యతలు

త్రిసభ్య కమిటీలకు

చెల్లుచీటీ

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో త్రిసభ్య (త్రీమెన్) కమిటీలపై వేటు పడింది. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారి స్థానంలో ఆఫీస్ ఇన్‌చార్జులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లా సహకార అధికారులకు నియామకపు బాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఆదేశాలతో తక్షణమే జిల్లా అధికారులు రంగంలోకి దిగి, అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన త్రిసభ్య కమిటీలకు చెక్ పడింది.

సంగం, జూలై 3 : ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 99 సహకార పరపతి సంఘాలు ఉండగా, విభజన జిల్లాలో 79 (సొసైటీ) ఉన్నాయి. గడిచిన ఐదేళ్లుగా సొసైటీలు త్రీమెన్ కమిటీల పాలనలోనే నడిచాయి. వైసీపీ ఈ సొసైటీలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చడంతో పలు సొసైటీల్లో భారీగా అవకతవకలు జరిగాయి. అందుకు సంగం సొసైటీయే ఓ నిదర్శనం. ఓ రైతు లోకాయుక్తాలో కేసు వేయడంతో విషయం బహిర్గతమై సుమారు రూ.42 లక్షలు సొసైటీ సొమ్ము త్రీమెన్ కమిటీ నుంచి రికవరీ చేయడం జరిగింది. ఇదేవిధంగా జిల్లాలో చాలా సొసైటీల్లో అవకతవకలు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. ఎన్నికల ఫలితాలు చూసిన తరువాత ఈ సంఘాలకు చెందిన త్రిసభ్య కమిటీలు రాజీనామా చేశాయి. రాజీనామా చేయని వారిపై టీడీపీ ప్రభుత్వం వేటు వేసింది. వాటి స్థానంలో పర్సన్ ఇన్‌చార్జులు నియమితులయ్యారు. ఇప్పుడు ఏ సొసైటీల్లో ఏ మేరకు అవినీతి అక్రమాలు జరిగాయో బహిర్గతమవుతాయా!? లేదా అని రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.



ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం

● వైసీపీలో ఇష్టారాజ్యం

వైసీపీ హయాంలో సహకార సంఘాలపై వైసీపీ నాయకుల పెత్తనం పెరిగింది. రైతులకు పరపతి తగ్గింది. ఎన్నికలు నిర్వహించకుండా ఐదేళ్లు గడిపారు. వైసీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జుల సిఫారసులతో ప్రతి ఆరు నెలలకు ఒకసారి త్రిసభ్య కమిటీలను నియమిస్తూ వచ్చారు. సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలకు పెద్దపీట వేశారు. ప్రభుత్వ సహకారం కొరవడి ధాన్యం కమీషన్ సొమ్ము కూడా ఇవ్వలేదు. జిల్లా సహకార బ్యాంకుల్లో కమీషన్‌ను డిపాజిట్ చేశారు. దానికి వడ్డీని సహకార సంఘాలకు అందిస్తూ వచ్చారు. ఒక పర్యాయంలో రైతులకు ఇచ్చిన రవాణా చార్జీలు కూడా సొసైటీలకు విడుదల చేశారు. ఆ సొమ్మంతా రైతు ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా వైసీపీ నేతలతో పాటు, త్రిసభ్య కమిటీ చైర్మన్‌లు సొంత అవసరాలకు వాడేసుకున్నారు.

● ఎన్నికలా? కమిటీలా?

వైసీపీ త్రిసభ్య కమిటీలను తక్షణమే రద్దు చేసేందుకు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం రంగంలోకి దిగింది. ప్రస్తుతం వెంటనే ఎన్నికలు జరిపించే అవకాశం లేకపోవడంతో డిసెంబరు 20వ తేదీ వరకు సుమారు ఆరు నెలల పాటు సొసైటీలకు ఆఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించింది. దాంతో అధికారికంగా త్రిసభ్య కమిటీలు రద్దయ్యాయి. భవిష్యత్తులో ప్రభుత్వం ఎన్నికలకు వెళుతుందా!? లేదంటే కొన్ని రోజుల తరువాత మళ్లీ కమిటీలను ఏర్పాటు చేస్తుందా అనే అంశం పై చర్చ నడుస్తోంది. మరోవైపు కూటమి శ్రేణులు కూడా తమకూ నామినేటెడ్ ద్వారా అవకాశం ఇవ్వాలని ఆశిస్తున్నారు. కొద్ది రోజులపాటైనా కమిటీలతోనే ముందుకు వెళ్లాలని అభిప్రాయంతో కూటమి శ్రేణులు ఉన్నాయి.

వరుణదేవా.. కరుణించవా !

గంపెడాశతో ఖరీఫ్ సీజన్‌లో సాగుకు సిద్ధపడుతున్న రైతన్నను వరుణుడు కటాక్షించడం లేదు. మెట్ట ప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గంలో చినుకు జాడ లేకపోవడంతో నీటివనరులన్నీ ఇంకిపోయాయి. 965 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఆత్మకూరు చెరువు ఇదిగో ఇలా చుక్కనీరు లేకుండా ఎండిపోయింది. పైతట్టు ప్రాంతా ల్లో వర్షం కురిస్తేనే కొండవాగు కాలువ, బొగ్గేరు ద్వారా ఈ చెరువుకు నీరు చేరుతుంది. అలాంటిది వానజాడే లేకపోవడంతో కాలువలతోపాటు చెరువూ ఎండిపోయింది. ఏరువాక పున్నమికి కూడా పొలంలోకి వెళ్లలేని పరిస్థితుల్లో రైతులు ఆకాశం వైపు వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు.

- ఆత్మకూరు



పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు పెట్టాలి

● అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి : బీజేపీ

కావలి, జూలై 3: యాజమాన్యం తప్పిదంతో బస్సు ప్రమాదం జరిగిం దని, అందుకు కారణమైన ఆర్ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు పెట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, జిల్లా మాజీ అధ్యక్షుడు జీ.భరత్‌కుమార్ డిమాండ్ చేశారు. కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి దౌర్జన్యాలు, అక్రమాలకు పరాకాష్టే స్కూల్ బస్సు ప్రమాదానికి గురై క్లీనర్ మృతి, విద్యార్థులకు గాయాలన్నారు. అధికారం ఉందన్న గర్వంతో నిబంధనలకు విరుద్ధంగా డివైడర్‌ను పగులకొట్టి తన స్కూల్‌కు వెళ్లేందుకు దారి చేసుకున్నార న్నారు. ఈ అక్రమ దారివలననే బస్సు ప్రమాదానికి గురైందన్నారు. దీనికి బాధ్యతగా స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసుతో పాటు డివైడర్ పగులకొట్టినా పట్టించుకోని అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గాయపడిన పిల్లల వైద్య ఖర్చులు యాజమాన్యం భరించి వారు కట్టిన ఫీజులు తిరిగి ఇవ్వాలన్నారు.

● మాజీ ఎమ్మెల్యే ఇంటి వద్ద ఆక్రమణల సంగతేమిటి?

పట్టణంలో వైసీపీ నేతలు ప్రభుత్వ భూములు ఆక్రమించి ఉంటే వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు తాను సహకరిస్తానని చెప్పిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి తన ఇంటి ఆవరణలో ఉన్న ఆక్రమణల సంగతేమిటని భరత్ ప్రశ్నించారు. తన ఇంటి ఆవరణలో ప్రభుత్వ స్థలం ఉందని తాను ఆధారాలతో నిరూపిస్తానని, దానిని అంబేడ్కర్ భవనానికి ఇవ్వాలని కోరారు. అలాగే కావలిలో అమ్ముల్‌ఫైలాన్‌ను ధ్వంసం చేసిన వారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నేతలు కమల, కే.బ్రహ్మానందం, పరుసు వెంకటేశ్వర్లు, మందా కిరణ్, శ్రీనివాసులు, రాజేష్, మురళీ, సుధీర్ పాల్గొన్నారు.

'వందేభారత్' రైలు ఢీకొని ఒకరి మృతి

కావలి రూరల్ : పట్టణంలోని బుడంగుంట గేట్ సమీపంలో బుధవారం సాయంత్రం వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొని గుర్తు తెలియని వృక్తి (50) మృతి చెందాడు. జీఆర్పీ ఎస్ఐ అరుణకుమారి కథనం మేరకు.. తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న వందేభారత్ రైలు కావలి వద్దకు వచ్చేసరికి పట్టాలు దాటుతున్న వృద్ధుడిని ఢీకొంది. వంద మీటర్ల వరకు మృతదేహాన్ని ఈడ్చుకుపోవడంతో శరీర భాగాలు చెల్లా చెదురయ్యాయి. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. స్టేషన్ మాస్టర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హోటళ్లపై అధికారుల దాడులు : ఓ దాబా సీజ్



దాబాలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు

కావలి, జూలై 3: కావలి పట్టణంలో పలు హోటళ్లపై బుధవారం మధ్యాహ్నం నెల్లూరు నుంచి వచ్చిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీరజ, కావలి శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పట్టణంలోని పేరున్న ఆర్‌కే దాబా, లేక్‌వ్యూ, విజయదుర్గా హోటళ్లలో తనిఖీలు చేపట్టారు. ఆర్‌కే దాబా హోటల్‌లో నాణ్యతలేని ఆహారం, నిల్వ ఉన్న మాంసం, రకరకాల మాంసాలు కలిసి ఉండటం, రంగులు కలిపిన చికెన్, ఫుడ్‌కలర్స్, వంటశాలలో ఎలుకలు తిరుగుతూ అపరిశుభ్రంగా ఉండడాన్ని గుర్తించి శాంపిల్స్ సేకరించారు. నిబంధనలు పాటించలేదంటూ ఆర్‌కే దాబా హోటల్‌ను సీజ్ చేశారు. అలాగే లేక్‌వ్యూ, విజయదుర్గా హోటళ్లలో తనిఖీల అనంతరం ఆహారపదార్థాల్లో కల్తీలు ఉన్నాయన్న అనుమానంతో వాటి శాంపిల్స్‌ను తీసుకుని వెళ్లారు. వాటిని ల్యాబ్‌లో పరిశీలించిన అనంతరం ఆ హోటళ్లపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ దాడులలో నెల్లూరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీరజ, కావలి శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జైన్ ఆలయంలో చోరీ

● రూ. 4లక్షలకు పైగా వెండి, నగదు అపహరణ



చిందరవందరగా పడి ఉన్న హుండీలు

వెంకటాచలం, జూలై 3: మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న జైన్ దేవాలయంలో బుధవారం వేకువ జామున చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుధవారం వేకువ జాము 3గంటల సమయంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు జైన్ దేవాలయం తలుపు లు తొలగించి లోనికి ప్రవేశించి మహవీర్ జైన్ విగ్రహానికి అంటించి ఉన్న వెండి కళ్లు, నాలుగు హుండీలను పగులగొట్టి వాటిలో ఉన్న నగదును అపహరించుకెళ్లారు. రూ.లక్ష విలువ చేసే వెండి వస్తువులు, నాలుగు హుండీలలో రూ. 3లక్షలకు పైగా నగదు ఉంటుందని జైన్ దేవాలయం కమిటీ సభ్యులు పోలీ సులకు తెలిపారు. విషయం తెలుసుకున్న వెంకటాచలం ఎస్ఐ రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్ టీం బృందం సంఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో రాత్రుళ్లు గస్తీ నిర్వహించాలి

కాగా, మండలంలోని కాకుటూరు, కనుపూరు, ఎర్రగుంట, వెంకటాచలం, కసుమూరు గ్రామాలలో ఇటీవల వరుస చోరీలు జరిగాయి. చోరీలను నివారించడంలో పోలీసులు విఫలమయ్యారని, ఇప్పటికైనా గ్రామాలలో రాత్రివేళల్లో పోలీసులు గట్టి గస్తీ నిర్వహించి చోరీలను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అన్యాయంగా కేసులు పెడుతున్నారని ఆత్మహత్యాయత్నం

● పురుగుమందు తాగిన కొమ్మరపూడి వాసి ● రూరల్ పోలీసు స్టేషన్‌లో ఘటన

● హుటాహుటిన జీజీహెచ్‌కు తరలింపు



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మల్లికార్జున్

నెల్లూరు రూరల్, జూలై 3 : తనపై అన్యాయంగా పోలీసు కేసులు పెడుతున్నారన్న మనస్తాపంతో ఓ వ్యక్తి నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన బుధవారం సంచలనంగా మారింది. నెల్లూరు రూరల్ మండలంలోని కొమ్మరపూడి గ్రామానికి చెందిన ఉప్పులూరి మల్లికార్జున్ (47)పై ఆయన సమీప బంధువు, అదే గ్రామానికి చెందిన రమణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి దాడిచేసి బంగారు నగలు అపహరించుకుపోయాడని ఫిర్యాదులో పేర్కొంది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి రమణమ్మ ఫిర్యాదులో వాస్తవం లేదని తేల్చారు. ఈ విషయమై మాట్లాడేందుకు బుధవారం మల్లికార్జున్‌ను స్టేషన్‌కు పిలిపించారు. అయితే స్టేషన్‌కు వచ్చిన మల్లికార్జున్ తనతో తెచ్చుకున్న పురుగుమందును తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించి స్థానికులు పోలీసులకు చెప్పడంతో వారు హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కాగా, రమణమ్మ గత పంచాయతీ ఎన్నికల సమయంలోనూ మల్లికార్జున్‌పై ఫిర్యాదు చేసిందని, అందులోనూ వాస్తవం లేదని తేల్చినట్లు పోలీసులు తెలిపారు. తాజా ఘటన కొమ్మరపూడి గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	130
లేయర్ లైవ్	115
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260
లేయర్	195

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6885
వెండి కిలో ధర	రూ. 92,200
వెండి ఒక గ్రాము	రూ. 94.20

తేనెటీగల దాడి : ముగ్గురికి గాయాలు



తేనె టీగల దాడిలో గాయపడిన సుధాకర్

అనంతసాగరం, జూలై 3 : మండలం లోని లింగంగుంట వద్ద ఆత్మకూరు ప్రధాన రహదారిపై బుధవారం సాయంత్రం తేనెటీగల దాడి చేయగా ముగ్గురు గాయపడ్డారు. లింగంగుంటకు చెందిన పీ సుధాకర్, రోడ్డుపై నడిచి వస్తుండగా ఒక్కసారిగా తేనెటీగలు దాడిచేశాయి. అదే సమయంలో బైక్‌పై వస్తున్న నరసింహులును, వరికుంటపాడుకు చెందిన ఏఎన్ఎం రత్నమ్మపై కూడా దాడి చేశాయి. గాయపడిన ముగ్గురిని అనంతసాగరం పీహెచ్‌సీకి తరలించి, వైద్యసేవలు అందించారు. సుధాకర్ పరిస్థితి విషమంగా ఉండడంతో ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు.

'ఆదాయం' పేరుతో వసూలు

● ఒక్కోరైతు నుంచి రూ.2100 దాకా ● విలేకరులకు సమాచారం ఇచ్చిన కర్షకులు

అల్లూరు: రైతు ఆదాయం రెట్టింపు చేయడమే లక్ష్యం.. తమది కేంద్ర ప్రభుత్వ సంస్థ అంటూ కొంతమంది రైతుల నుంచి నగదు వసూలు చేస్తున్నారు. వారి మా టలు నమ్మి చెల్లించిన కర్షకులు చివరకు మోసపోయామని గ్రహించి, వాపోయారు. బాధి తుల కథనం మేరకు.. కేంద్ర ప్రభుత్వ సంస్థలో తాము బాగమంటూ ఓ కంపెనీ ప్రతి నిధులు అల్లూరు, విడవలూరు మండలాల్లో విస్తృతంగా కరపత్రాలు పంచారు. ఒక్కో రైతు నుంచి రూ.2100 తీసుకుని రశీదు కూడా ఇస్తున్నారు. చెల్లించిన మొత్తం ఎందుకని ప్రశ్నించిన రైతులకు తమ సంస్థ అభివృద్ధి చెందిన అనంతరం సబ్సిడీ ద్వారా విత్తనాలు, ఎరువు లు, స్టోరేజీ కేంద్రా లు తదితర వాటిని సమకూర్చుతామని నమ్మబలికారు. ఈ మేరకు కొంతమంది వద్ద నగ దు వసూలు చేసినట్టు సమాచారం. సంస్థ ప్రతినిధుల మాటలు నమ్మని రైతులు ఈ సమాచారాన్ని విలేకరుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ వ్యవహారంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

వినియోగించకనే డ్యాం సామగ్రి తుప్పు



డ్యాంపై నిరుపయోగంగా ఉన్న ఇనుప సామగ్రి

సోమశిల జలాశయం వద్ద విలువైన డ్యాం సామగ్రి వినియోగించకుండానే తుప్పుపడుతున్నది. జలాశయ పరిసర ప్రాంతాల్లో నిర్మాణాల కోసం తెచ్చిన స్టాప్‌లాగ్ గేట్, గ్యాంట్రీ క్రేన్, గంగ వరద కాలువ ముఖద్వారానికి అమర్చాల్సిన సామగ్రి ఏళ్ల తరబడి వినియోగించకపోవడంతో వృథాగా పడిఉంది. టన్నుల కొద్ది బరువున్న ఈ సామగ్రిని డ్యాం ప్రధాన కట్టడంపై ఉంచడంతో డ్యాం పటిష్ఠతకు ప్రమాదం పొంచి ఉంది. ఇకనైనా ఈ సామగ్రిని వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- అనంతసాగరం

తెరవెనుక ఎవరెవరు?

● 2022లో హెల్త్ అసిస్టెంట్ల నియామకం
● భారీస్థాయిలో అవకతవకలంటూ ఆరోపణలు
● తాజాగా విచారణకు ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం
● ఈ నెల 10న చేపట్టనున్న ఆర్డీ
● నాటి అధికారుల్లో గుబులు

నెల్లూరు(వైద్యం), జూలై 3 : వైద్య ఆరోగ్యశాఖలో 2022 వరకు కాంట్రాక్టు పద్ధతిలో జరిగిన హెల్త్ అసిస్టెంట్ నియామకాలపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. వైసీపీ పాలనలో చేపట్టిన ఆ ఉద్యోగ నియామకాల్లో భారీగా అవకతవకలు జరిగాయని, నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరించారని అప్పట్లోనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అయినా ఉన్నతాధికారులు వాటిని పట్టించుకోకుండా నియామకాలు జరిపారు. అయితే తెలు గుదేశం ప్రభుత్వం రావటంతో ఆ నియామకాలపై రాష్ట్ర వ్యాప్తంగా విచారణకు సిద్ధమైంది. వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ శోభారాణికి విచారణ బాధ్యతలు అప్పగించింది. ఈ క్రమంలో ఆమె ఈ నెల 10వ తేదీన నెల్లూరు జిల్లాలో హెల్త్ అసిస్టెంట్ నియామకాలకు సంబంధించి విచారణ చేపట్టనున్నారు. దీంతో నాటి అధికారుల్లో ఆందోళన మొదలైంది.



రోస్టర్ పద్ధతి పాటించకుండా..?

హెల్త్ అసిస్టెంట్ నియామకాల కోసం 2002 సంవత్సరంలో అనేక మంది పరీక్షలు రాశారు. అయితే అప్పట్లో ప్రభుత్వం వీరి నియామకాలు చేపట్టలేదు. దీంతో అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. హెల్త్ అసిస్టెంట్ల నియామకం చేపట్టాలని, కోర్టును ఆశ్రయించిన వారిని పరిగణలోకి తీసుకోవాలని 2020, 2021లో హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో 2020లో 19 మంది, 2021లో 79 మంది, 2022లో 21 మందిని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నియమించారు. ఈ ఉద్యోగాల భర్తీని రోస్టర్ విధానం, మెరిట్ ప్రాతిపదికన చేపట్టాల్సి ఉంటుంది. కానీ, ఇందుకు విరుద్ధంగా భారీగా ముడుపులు పుచ్చుకుని నియామకాలు జరిపినట్లు ఆరోపణలున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో దగ్గరగా ఉన్న వాటిలో హెల్త్ అసిస్టెంట్ పోస్టుకు ఒక రేటు, దూరంగా ఉన్న పీహెచ్‌సీలకు ఒక రేటు లెక్కన వసూలు చేసినట్లు ప్రచారం జరిగింది. నాటి వైసీపీ ప్రభుత్వంలోని కొందరు నేతలు కూడా వారికి అనుకూల మైన వారి కోసం అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. ఇలాంటి అవకతవకల కారణంగా అర్హులైన కొందరికి తీవ్ర అన్యాయం జరిగినట్లు ఆరోపణలున్నాయి.



ఈ నెల 10న విచారణ

2022 వరకు హెల్త్ అసిస్టెంట్ల నియామ కాలు జరిగాయి. అప్పట్లో నేను జిల్లాలో లేను. ఈ నియా మకాలపై తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఆర్డీ డాక్టర్ శోభారాణి ఈ నెల 10న విచారణ జరపనున్నారు. ఇందులో వాస్తవాలు తెలిసే అవకాశం ఉంది.

- డాక్టర్ పెంచలయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి



హైకోర్టు ఆదేశించినా ఉద్యోగం ఇవ్వలేదు

నన్ను హెల్త్ అసిస్టెంట్‌గా నియమించేందుకు పరిశీలించా లని హైకోర్టు 2021లో ఆదేశాలు జారీ చేసింది. దీంతో కోర్టు ఉత్త ర్వుల కాపీని జత చేసి వైద్య ఆరోగ్యశాఖలో దరఖాస్తు ఇచ్చాను. అయితే, హెల్త్ అసిస్టెంట్ నియామకాలు జరిగి పోయాయని, ఖాళీలు లేవని అధికారులు చెప్పారు. ఏమి చేయాలో తెలియటం లేదు. పూర్తిస్థాయి విచారణ జరిపి నాకు న్యాయం చేయాలి.

- ఓరుగంటి వేమయ్య

సోమశిలలో 10.149 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, జూలై 3: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, బుధవారం నాటికి డ్యాంలో 10.149 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 354 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

డీఐవోగా డాక్టర్ ఉమామహేశ్వరి



డీఎంహెచ్‌వో నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న డాక్టర్ ఉమామహేశ్వరి

నెల్లూరు (వైద్యం), జూలై 3 : జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి(డీఐవో)గా డాక్టర్ ఉమామహేశ్వరి బుధవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య నుంచి ఆమె ఉత్తర్వులు అందుకున్నారు. గతంలో డీఐవోగా ఉన్న డాక్టర్ సెరీనాకుమారి గత నెల 30న ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఖాళీగా ఉన్న ఆ స్థానంలో నెల్లూరు సెంట్రల్ జైలులో వైద్యాధికారిగా పని చేస్తున్న డాక్టర్ ఉమామహేశ్వరిని ప్రభుత్వం నియమించింది. ఆమెకు గతంలో వైద్య ఆరోగ్యశాఖ పలు విభాగాలలో పనిచేశారు. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో జైలు నుంచి బదిలీయై డీఐవోగా బాధ్యతలు చేపట్టారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ఇందుకూరుపేట, జూలై 3: మండలంలోని గంగపట్నం చెరువులో పడి అదే గ్రామానికి చెందిన బొప్పి సూలం (48) బుధవారం మృతిచెందాడు. చెక్కరిక్షా తోలుకొని జీవనం సాగించే సులం చనిపోవడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. కోవూరు సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సూర్యనారాయణపై అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలి

● ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి



సూర్యనారాయణపై అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని కోరుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

నెల్లూరు(హరనాథపురం), జూలై 3 : ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణపై గతంలో నమోదైన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని ఏపీజీఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి కోరారు. ఏపీజీఈఏ జిల్లా కార్యాలయంలో బుధవారం వివిధ ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాటాలు చేసిన సూర్యనారాయణపై గతంలో నమోదైన కేసులు న్యాయబద్ధమైనవి కావన్నారు. ఈ క్రమంలో కేసులు ఉపసహరించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీజీఈఏ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, రాంప్రసాద్, వాణిజ్యపన్నులశాఖ జిల్లా కార్యదర్శి సుజాత బాయి, పశుసంవర్ధకశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, ఏపీజీఈఏ సిటీ అధ్యక్షకార్యదర్శులు కిరణ్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

మలేరియా, డెంగ్యూ ప్రబలనివ్వొద్దు

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య



మాట్లాడుతున్న డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు(వైద్యం), జూలై 3 : ప్రస్తుత వర్షాకాలంలో దోమల ఉత్పత్తి ఎక్కువగా ఉంటుందని, ఈ నేపథ్యంలో మలేరియా, డెంగ్యూ, డయేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలకుండా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో బుధవారం మలేరియా సబ్‌యూనిట్ అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్ల సమావేశం జరిగింది. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆయా వ్యాధులతో ఎలాంటి మరణాలు సంభవించకుండా వ్యాధిగ్రస్తులకు తగిన చికిత్సలు అందించాలన్నారు. ఏడీఎం హెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడుతూ వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో కచ్చితత్వం పాటించాలని, రికార్డులు పక్కాగా నిర్వహించాలని సూచించారు. క్షయ వ్యాధి నివారణకు ఇచ్చిన లక్ష్యాలను సాధించలేని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మలేరియా నివారణ జిల్లా అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ వ్యాధుల నిర్ధారణ, సంబంధిత రికార్డులపై ఎలాంటి అలసత్వం వద్దన్నారు. లార్వా దశలోనే దోమలను నివారించాలని వాటి నియంత్రణకు కాలువల్లో గంబూసియా చేపలను వదలాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్‌వో డాక్టర్ భాస్కర్, డెమో శ్రీనివాసరావు, డాక్టర్ ప్రమోద్, నాగార్జునరావ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో నర్సు పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), జూలై 3 : కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయంలో నర్స్ పోస్టుకు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ విద్యాలయం ప్రిన్సిపాల్ శంకరయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిప్లమో ఇన్ నర్సింగ్ లేదా జనరల్ నర్సింగ్ చేసిన మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫొటోలు, జిరాక్స్ కాపీలతో ఈనెల 6వతేదీన విద్యాలయం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌నుగానీ కార్యాలయంలోగానీ సంప్రదించాలని కోరారు.

ఉత్సాహంగా ఎడ్ల పందేలు



బండ లాగుతున్న ఎడ్లు

కొండాపురం, జూలై 3: మండలంలోని గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురంలో శ్రీ అన్నపూర్ణ విశాలాక్షి కాశీవిశ్వేశ్వరస్వామి తిరునాళ్ల ఘనంగా జరుగుతున్నాయి. మూడవరోజు బుధవారం జరిగిన ఎడ్ల పందేలాకు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన 14 జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఈ పోటీలలో మొదటి ఐదు స్థానాలను నెల్లూరు జిల్లాకుచెందిన ఎద్దులే గెలుచుకున్నాయి. నిర్ణీత సమయంలో బండను లాగి జొన్నవాడ అంకయ్య ఎద్దులు మొదటి స్థానం సాధించాయి. అలాగే దామరమడుగు శైలజారెడ్డి ఎద్దులు, గొల్లపల్లి శీనివాసులరెడ్డి ఎద్దులు, టీ.శంకరరెడ్డి ఎద్దులు కృష్ణతేజారెడ్డి ఎద్దులు ఆ తర్వాతి స్థానాల్లో నిలబడ్డాయి. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, జాగర్లమూడి శ్రీనివాసులు, నర్రాచెంచునాయుడు, అయితా వెంకటేశ్వర్లు, మాధవరపు కొండలరావు, చిమ్మిలి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'జలజీవన్' పనులు పరిశీలిస్తాం

జలశక్తి అభియాన్ జాయింట్ సెక్రటరీ సచేంద్ర కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సచేంద్రకుమార్

నెల్లూరు(జడ్పీ), జూలై 3: జలజీవన్ మిషన్ పథకం ద్వారా జిల్లాలో చేపట్టిన పనుల న్నింటినీ వ్యవసాయ సీజన్‌కు ముందే పరిశీలి స్తామని జలశక్తి అభియాన్ జాయింట్ సెక్రటరీ సచేంద్ర కుమార్ తెలిపారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో కలెక్ట రేట్‌లోని శంకరన్ హాలులో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. జలశక్తి అభియాన్ పథకం ద్వారా వాటర్‌షెడ్లు, చెరువులు, కుంటలు తదితర అభివృద్ధి పనులు చేశారన్నారు. వాటన్నింటిని సందర్శించి భూగర్భజలాలు పెరిగాయా... లేదా అనే విషయాన్ని స్వయంగా పరిశీలిస్తామన్నారు. భూ గర్భ జలాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను అధికా రులకు వివరించామన్నారు. గురువారం కలిగిరి మండలం సిద్ధనకొండూరు, నాగసముద్రం, కలిగిరి, వింజమూరు మండలంలోని వింజమూరు, చాకలికొండ, వరికుంటపాడు మండలంలోని తూర్పుచెన్నంపల్లి, రామాపురం గ్రామాల్లో పర్యటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డ్వామా పీడీ శ్రీనువాసులు, జేడీ సత్యవాణి, డీఎఫ్‌వో శ్రీనువాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జయభారత్ ఆసుపత్రికి రూ.15 లక్షల పరికరాల విరాళం



పరికరాలతో దాత, ఆసుపత్రి నిర్వాహకులు

నెల్లూరు(వైద్యం), జూలై 3 : నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రికి గునపాటి హరిచంద్రరెడ్డి జ్ఞాపకార్థం సతీమణి శ్యామలమ్మ, కుమారుడు ప్రజాద్‌రెడ్డి రూ.15 లక్షల విలువైన వైద్య పరికరాలను బుధవారం అంద చేశారు. ఆసుపత్రిలోని కంటి విభాగం కోసం బీస్కాన్, ఫండస్ కెమెరా పరిక రాలను బెజవాడ కృష్ణారెడ్డి ద్వారా అందించినట్లు ఆసుపత్రి చైర్మన్ పొన్నవోల సీతారామిరెడ్డి తెలియచేశారు. కంటి జబ్బు ఉన్నవారికి నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి ఈ పరికరాలు ఉపయోగపడతాయన్నారు. అలాగే, రూ.12,300తో బెజవాడ కృష్ణారెడ్డి సోదరీమణుల జ్ఞాపకార్థం స్లిట్ ల్యాంప అనే వైద్య పరికరాన్ని విరాళంగా అందించారని చెప్పారు. ఆసుపత్రి ప్రధాన కార్యదర్శి హరికుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యశాలలో క్యాటరాక్ట్ ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నామని, ఇందుకు అనేక మంది దాతలు సహకరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ కృష్ణారెడ్డి, బాలు, సుబ్బారావు, గుర్రం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలి

● డీఈవో రామారావు ● ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ

నెల్లూరు (విద్య), జూలై 3 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు జాతీయ పోటీ పరీక్షల్లో రాణించేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని డీఈవో రామారావు సూచించారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో రోటరీక్లబ్, యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్ సహకారంతో నగరంలోని అవెన్యూస్ పాఠశాలలో మూడురోజులు జరిగిన ఉపాధ్యాయుల శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఎడ్యుకేషన్ కార్యక్రమం నిర్వహించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే ప్రపంచ స్థాయి ఉద్యోగావకాశాలు, అందుకు కావాల్సిన అర్హతలు, నేటి సమాజ పరిస్థితులకు అనుగుణంగా మారే వృత్తులపై అవగాహన పెంచడమే ఈ తరగతుల లక్ష్యమని చెప్పారు. జిల్లాలోని మోడల్ స్కూల్స్, కేజీబీవీ, జడ్పీ స్కూళ్ల ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాలల అధ్యాపకులు ఈ శిక్షణలో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి, రాష్ట్ర పరిశీలకురాలు డాక్టర్ శారదా కుమారి, ఆర్ఐవో శ్రీనివాస్, గ్లోబల్ ఎడ్యుకేషన్ సొసైటీ సీఈవో రాక్వెల్ శరఫ్, డీవీఈవో మధుబాబు, ఏఎంవో సుధీర్‌బాబు, ఎంఈవో మురళీధర్, రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు వార్షిక వేడుకలు



పోలేరమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంగం, జూలై 3: మండలంలోని అనసూయనగర్‌లో ఉన్న పోలేరమ్మ ఆలయంలో బుధవారం వార్షిక వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి, పూలతో అలంకరించారు.అనంతరం ప్రత్యేక పూజలు, కుంకుమార్చన చేశారు. మధ్యాహ్నం అన్నదానం, రాత్రికి గ్రామోత్సవం నిర్వహించారు.

సీతారామపురంలో పారిశుధ్య పనులు

సీతారామపురం. జూలై 3: సర్పంచి కే భాగ్యకుమారి ఆదేశాల మేరకు బుధవారం సీతారామపురంలోని కోటవీధి, కురవవీధి, పడమరవీధుల్లో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం వల్ల ప్రజలు సీజనల్ వ్యాధులకు గురి అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా డయేరియా, మలేరియా, డెంగ్యూ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నందున ప్రతిరోజూ పారిశుధ్య పనులు జరిగేలా ప్రణాళిక రూపొందించామన్నారు.

వరుణదేవా.. కరుణ చూపవా ?

● తొలకరి వర్షాలకు అరకొరగా పదును

● నీరు లేక వెలవెలబోతున్న పెద్ద చెరువులు

● ఎండిన ఆత్మకూరు తటాకం

ఆత్మకూరు, జూలై 3: ఖరీఫ్‌పై ఎంతో ఆశతో సాగుకు సిద్ధపడుతున్న రైతన్నపై వరుణుడు కరుణ చూపడంలేదు. ఈసారి వర్షాలు బాగా కురుస్తాయని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొనడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. గతనెలలో ఆత్మకూరు నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు మాత్రమే పడ్డాయి. పదును వాన పడితేనే భూములు సాగుకు యోగ్యంగా ఉంటాయి. వాన కురవక రైతులు ఏరువాక పున్నమికి కూడా పొలాల వైపు వెళ్లలేదు.

● సాగు కాని పంటలు

ఈ ఏడాది ఖరీఫ్‌లో ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో పంటలు సాగుకాలేదు.ఈ సీజన్‌లో తొలకరి వర్షాలు పడితే పెసర, సజ్జ, రాగి తదితర మెట్ట పైర్ల సాగుకు రైతులు సన్నద్ధమవుతారు. జూన్‌కు ముందు దుక్కులు దున్నేందుకు వర్షాలు సరిగా పడలేదు. పదును వర్షం పడితే దున్నుకున్న పొలాల్లో పంట సాగుకు సిద్ధమవుతారు.

● ఎండిన ఆత్మకూరు చెరువు

నియోజకవర్గంలో పెద్ద చెరువులుగా పేరొందిన ఆత్మకూరు, మహిమలూరు, వాసిలి, జమ్మవరం, అనుమసముద్రం తదితర చెరువుల్లో నీరు లేక చిన్నబోతున్నాయి. ఈ చెరువుల కింద ఉన్న వేలాది ఎకరాలు సాగుకు నోచుకోలేదు. ఆత్మకూరు చెరువు ఆయకట్టు కింద సుమారు 6500 ఎకరాల ఆయకట్టు ఉంది. గత ఏడాది వర్షాభావ పరిస్థితుల్లో చెరువులు పూర్తిగా నిండిన దాఖలాలు లేవు. ప్రస్తుతం చెరువుల్లో నీరు నిల్వ లేకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక మండలంలోని వాసిలి చెరువు కింద 2500పైగా ఆయకట్టు ఉంది. ఈ చెరువుకు బొగ్గేరు నుంచి వచ్చే నీరే ఆధారం. ఆత్మకూరు చెరువు నిండి, మిగిలిన నీరు అలుగుకాలువ గుండా పారి ఈ చెరువు నిండాల్సి ఉంది. అయితే ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆత్మకూరు చెరువులోనే చుక్కనీరు లేకపోవడంతో వాసిలి చెరువు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ క్రమంలో వర్షం కోసం రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.



అనంతసాగరం మండలంలో చుక్కనీరు లేని బొమ్మవరం చెరువు



మర్రిపాడు : ఎండిన పడమటినాయుడుపల్లి చెరువు

ప్రభుత్వ కార్యాలయాల్లో ఫొటోలు పెట్టండి

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



ఎంపీడీవో కార్యాలయంలో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కలిగిరి, జూలై 3: ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రొటోకాల్ ప్రకారం పీఎం నరేంద్రమోదీ, సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోలు పెట్టాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలిగిరికి వచ్చిన ఆయన ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాలతోపాటు మండల విద్యావనరుల కేంద్రాల్లో ఫొటోలు లేకపోవడాన్ని గుర్తించి ప్రభుత్వాలు ఏర్పడి ఇన్ని రోజులు గడుస్తున్నా ఇంకా ఎందుకు ఫొటోలు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ప్రజలకు రెవెన్యూ సేవలను సక్రమంగా అందించాలని తహసీల్దారు బాలకిషోర్‌కు, గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీవో రంగసుబ్బరాయుడుకు సూచించారు. అనంతరం రోడ్డు విస్తరణలో సమాచారం ఇవ్వకుండా కూల్చిన భవనాలను సందర్శించారు. సమాచారం ఇవ్వకుండానే భవనాల కూల్చివేత అని జూన్ 30న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించి నష్టపోయే యజమానులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కావలి ఆర్డీవో శీనానాయక్‌కు ఫోన్ చేసి చెప్పారు. ఈ కార్యక్రమాల్లోటీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, కాకు మహేష్, స్వర్ణ కొండయ్య, వెంగపనాయుడు, వరప్రసాద్, గొల్లపూడి ప్రసాద్, కిలారి కొండపనాయుడు, మాదాల శ్రీనివాస్, లెక్కల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన హెచ్‌ఎంకు సన్మానం



హెచ్ఎంను సన్మానించిన కమిటీ సభ్యులు

ఉదయగిరి రూరల్, జూలై 3: మండలంలోని గండిపాళెం ప్రధాన ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తూ గతనెల 30న పదవీ విరమణ చేసిన షేక్ జాఫర్‌సాహెబ్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఇక నుంచి ఆయన శేషజీవితం ఆనందంగా గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ పాముల రమాదేవి, గ్రామస్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి



రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఎంఈవో

ఉదయగిరి రూరల్, జూలై 3: విద్యార్థుల్లో పఠన, అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి తెలిపారు. బుధవారం మండలంలోని అప్పసముద్రం మెయిన్, చవటపల్లి ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతి, అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. పాఠశాలల మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆయన పలు రిజిస్టర్లను పరిశీలించారు.

ఆత్మకూరు ఇన్‌చార్జి ఎంఈవోగా జ్యోతి



ఇన్‌చార్జి ఎంఈవో జ్యోతిని సన్మానిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఆత్మకూరు, జూలై 3: ఎంఈవోగా ఎం జ్యోతి నియమితులయ్యారు. బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు, కార్యాలయ సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని పాఠశాలకు పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు అందజేయాలని కోరారు. ఉపాధ్యాయుల కొరత దృష్ట్యా పాఠశాలలకు వర్క్ అసిస్టెంట్‌ను వేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏ సురేంద్రరెడ్డి, ఇతర నాయకులు ఆర్ వెంకటేశ్వర్లురెడ్డి, నరేంద్రరెడ్డి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ఉదయగిరిలో మోస్తరు వర్షం



ఉదయగిరిలో కురుస్తున్న వర్షం

ఉదయగిరి రూరల్, జూలై 3: మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో మురుగు కాలువలు పొంగడం, రహదారులు చెత్తాచెదారంతో నిండిపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొన్నిరోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ పంటల సాగుకు ఎంతోమేలు చేకూరుతుందని రైతులు అంటున్నారు. ఉద్యాన పంటలకూ ఈ వర్షం ఊరటనిచ్చింది. అలాగే దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో సైతం వర్షం కురిసింది.

చేపల అక్రమ వేటపై విచారణ

● పాలకవర్గ సభ్యులపై పోలీసులకు ఫిర్యాదు



మత్స్యకారులను విచారిస్తున్న విచారణాధికారి శ్రీనివాసులు

కలువాయి, జూలై 3 : స్థానిక చెరువులో చేపల అక్రమ వేటపై ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదు మేరకు బుధవారం మత్స్యశాఖ కావలి ఏడీ శ్రీనివాసులు మత్స్యకారులను విచారించారు. అనంతరం కలువాయి మత్స్య సొసైటీ మాజీ అధ్యక్షుడు వజ్రాల శ్రీనివాసులు, మరి కొంతమంది మత్స్యకారుల వద్ద నుంచి ఆయన రాత పూర్వక స్టేట్‌మెంట్ తీసుకున్నారు. రెండేళ్లుగా మత్స్య సొసైటీ పాలకవర్గ సభ్యులు, కాపలాదారులు, మరి కొంతమంది కలసి చెరువులో చేపలను అక్రమంగా రాత్రివేళ పట్టించి అమ్ముకున్నారని మత్స్యకారులు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసు కోవాలని మత్స్యకారులు కోరారు. ఈ స్టేట్‌మెంట్ ఆధారంగా విచారణ అధికారి ఎస్.శ్రీనివాసులు పాలకవర్గ సభ్యులు బచ్చల బాలయ్య, ధనుం మధు, బచ్చల శేఖర్, వజ్రాల సుబ్బయ్య, ఈగ ఆదెయ్య, వడ్డిదారి సురేష్, కాలిచప్పిడి రత్నయ్య, సింగమల ఎల్లయ్య, బచ్చల చంద్రకాంత్‌తోపాటు వారికి సహకరించిన, చేపలు కొనుగోలు చేసి, కాపలాదారులపై కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఇసుక ట్రాక్టర్లు


ఉలవపాడు, జూలై 3 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై బాజీరెడ్డి తెలిపారు. బుధవారం భీమవరం గ్రామం సమీపంలో మన్నేరు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో సంఘటనా స్థలంకు చేరుకొని ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లింగసముద్రం : మండలంలోని పెదవని శివారులో ఇసుక అక్రమంగా తరలిస్తున్న అంగిరేకులపాడుకు చెందిన ట్రాక్టర్‌ను కందుకూరి ఎస్ఈబీ ఎస్సై దీప్తీ కరంత్, సిబ్బంది పట్టుకున్నారు. ఆ ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించగా స్థానిక ఎస్సై బాజీబాబుకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలి

ఉదయగిరి రూరల్, జూలై 3 : ఉపాధి హామీ పథకం కింద పండ్లతోటల పెంపకానికి ఆసక్తిగల రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీవో బీ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో 200 ఎకరాల్లో పండ్లతోటల పెంపకం లక్ష్యమన్నారు. ఆసక్తిగల వారు 1బీ, అడంగల్, పాసు పుస్తకం, సన్న, చిన్నకారు రైతు సర్టిఫికెట్, జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు నకల కాపీలతో ఉపాధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అనంతసాగరంలో కల్తీ మద్యం ?



వైరల్ అవుతున్న మద్యం సీసా

అనంతసాగరంలో కల్తీ మద్యం అమ్ముతున్నట్లు మందుబాబులు ఆరోపిస్తున్నారు. ఫుల్ బాటిల్ మూత తొలగించి అందులో నుంచి కొంత మందు తీసి, అదే మోతాదులో నీళ్లు కలిపి విక్రయిస్తున్నారని వారంటున్నారు. ఈ వ్యవహారంపై అధికారులు విచారణ జరపాలని వారు కోరుతున్నారు. కల్తీ మద్యం అమ్ముతున్నట్లు రెండు రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.

- అనంతసాగరం

నేడు అడవి పేరంటాలమ్మకు నెల పొంగళ్లు

ఉదయగిరి, జూలై 3: మండలంలోని గన్నేపల్లి పంచాయతీలో వెలసి ఉన్న అడవిపేరంటాలమ్మకు గురువారం నెల పొంగళ్లు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పులిగుండ్ల రవీంద్ర బుధవారం తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి నైవేద్యం సమర్పించాలని ఆయన కోరారు.

'నేను బడికి పోతా'పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 3: దుత్తలూరులో బుధవారం నేను బడికి పోతా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, ఎంఈవోలు మస్తాన్‌వలి, వెంగయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

6న కుక్కలకు టీకాలు

వరికుంటపాడు, జూలై 3: ఈనెల 6న వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో కుక్కలకు రేబిస్ టీకాలు వేయనున్నట్లు పశు వైద్యాధికారి రాఘవేంద్రశర్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాటి యజమానులు పశు వైద్యశాలలు, రైతు సేవా కేంద్రాలను సంప్రదించి,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చినుకు పడితే వణుకే..

భయం గుప్పెల్లో విద్యార్థులు



కూలేందుకు సిద్ధంగా భోజనశాల

ఉదయగిరి రూరల్ : మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాల భోజనశాల(డైనింగ్ హాల్ కమ్ కిచెన్) శిథిలావస్థకు చేరింది. దీంతో అది ఎప్పుడు కూలి ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1988లో పాఠశాలతోపాటు భోజనశాలను నిర్మించారు. ప్రస్తుతం ఆ భవనం శిథిలావస్థకు చేరి, శ్లాబు పెచ్చులూడి ఇనుపచువ్వలు బయటపడి ప్రమాదకరంగా ఉంది. పాఠశాలలో 370 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతిరోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం భోజనశాలలో చేయడంతోపాటు సిబ్బంది వంటలు కూడా ఆ భవనంలోనే చేయాల్సి ఉంది. ఆ సమయంలో శ్లాబు పెచ్చులూడి పైనపడుతుండడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. గత కొన్ని రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు భవనం ఉరుస్తుండడంతో ఏ సమయంలో ఏం జరుగుతుందోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ భవనంపై దృష్టిసారించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అధికారులు భవనాన్ని పరిశీలించి నూతన భవన నిర్మాణానికి రూ.కోటితో ప్రతిపాదనలు పంపారని ప్రిన్సిపాల్ పుష్పరాజ్ తెలిపారు. భవన నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమయిందని, ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనం మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇష్టంతో కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

● ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి



కృష్ణకుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

బిట్రగుంట, జూలై 3: విద్యార్థి దశలో ఇష్టంతో కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. బోగోలు మండలం తిప్ప జూనియర్ కళాశాల, విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బచ్చు వెంకట కృష్ణయ్య జ్ఞాపకార్థం బచ్చు అమరా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్టు వ్యవస్థాపకుడు బచ్చు కృష్ణకుమార్, సంధ్యలు నిర్మించిన అదనపు తరగతి గదులు, స్టేజీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రిష్ణారెడ్డి మాట్లాడుతు వృత్తిరీత్యా విదేశాల్లో ఉంటున్నా స్వదేశం, పుట్టిన ఊరుపై మమకారంతో కృష్ణకుమార్ ఆయన సోదరి అమరా బచ్చు పేరున ట్రస్ట్ ఏర్పాటు చేసి గుడులు, బడులు నిర్మించడమే కాకుండా ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. పాఠశాలలో పదవ తరగతి పాసైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. కళాశాల, పాఠశాలల ఆవరణంలో మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, రవీంద్రనాథ్ ఠాగూరుల ఆధ్వర్యంలో జరిగిన నేను బడికి పోతా కార్యక్రమంలో విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. దాత బచ్చు కృష్ణకుమార్‌ను శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో కప్పరాళ్లతిప్ప జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత మొదటిసారి మండలానికి వచ్చిన ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డికి టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, తెలుగు తమ్ముళ్లు తిప్ప జాతీయ రహదారి వద్ద ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు, ప్రసన్న వేంకటేశ్వరస్వామి పాలక మండలి చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, నాయకులు కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, ఎల్.సుధీర్‌బాబు, చిలకపాటి వెంకటేశ్వర్లు, దొడ్ల అంజయ్య యాదవ్, యర్రం.వెంకటేశ్వర్లురెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దేవరాల చిన్నకొండయ్య ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

స్కూల్ బస్సు ప్రమాదం బాధాకరం

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి



విద్యార్థిని పరామర్శిస్తున్న ప్రతాప్‌కుమార్ రెడ్డి

కావలిటౌన్, జూలై 3: స్కూల్ బస్సు ప్రమాదానికి గురికావడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థులను బుధవారం ఆయన వారి నివాసాలకు, ఆసుపత్రులకు వెళ్లి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదం జరగటం, బస్సు క్లీనర్ చనిపోవడం, విద్యార్థులకు తీవ్ర గాయాలవడం తెలుసుకుని చలించిపోయానన్నారు. గాయపడ్డ విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక ఇబ్బందులు కలగకుండా తానే బాధ్యత తీసుకుని వైద్యం చేయిస్తానన్నారు. మృతి చెందిన క్లీనర్ కుటుంబానికి అండగా ఉంటానన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి బాధితులను పరామర్శించి ధైర్యాన్ని కల్పించిన కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

3140 లీటర్ల డీజిల్ పట్టివేత



పట్టుబడిన ఆయిల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దారు

ఉలవపాడు, జూలై 3 : ఉలవపాడు జాతీయ రహదారిపై ఆయిల్ దందా చేస్తున్న అక్రమార్కులపై బుధవారం స్థానిక రెవెన్యూ అధికారులు దాడులు చేశారు. తహసీల్దారు చంద్రారెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది హైవే వెంట ఉన్న డీజిల్ షాపులపై తనిఖీలు చేపట్టారు. రాజుపాలెం ఎస్టీ కాలనీలో కట్టా చెంచురామయ్య ఇంటి వద్ద అక్రమంగా 2800 లీటర్ల డీజిల్, కలికివాయి కోటేశ్వరరావు 210 లీటర్లు, కోటు సురేంద్ర 130 లీటర్లు డీజిల్ నిల్వ చేసి ఉండగా పట్టుకున్నారు. అధికారుల దాడులు తెలుసుకున్న మరో 10 మందిపైగా అక్రమ ఆయిల్ నిర్వాహకులు సరుకును జాగ్రత్త పరిచి అధికారులకు పట్టుబడకుండా తప్పించుకున్నారు. ప్రస్తుతం పట్టుబడిన 3140 లీటర్ల డీజిల్‌ను చాగొల్లు హైవే పక్కన ఉన్న కేవీఆర్ పెట్రోల్ బంక్‌కు తరలించినట్లు తహసీల్దారు చెప్పారు. నిందితులపై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో డీటీ వీరయ్య, రీసర్వే డీటీ రామమూర్తి, ఇన్‌చార్జ్ ఆర్ఐ బాలచంద్ర, వీఆర్వోలు పద్మజ, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యం కోసం ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న సురేష్‌రెడ్డి, తదితరులు

కందుకూరు, జూలై 3: అరుదైన లివర్ వ్యాధితో బాధపడుతూ విజయవాడలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందిన చిన్నారి షేక్ ఆర్మాన్ వైద్యం కోసం స్థానిక వ్యాపారి సురేష్‌రెడ్డి రూ.25వేలు, ఆయన చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్న సిబ్బంది, మిత్రులు కలిసి మరో రూ.50 వేల ఆర్థికసహాయం బుధవారం అందించారు. ఆర్మాన్ తల్లిదండ్రులు ఆరీఫ్, అఫ్రిన్లు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘర్షణపై కేసు నమోదు

ఉలవపాడు, జూలై 3 : ఉలవపాడు అంబేడ్కర్ నగర్‌కు చెందిన రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాజీరెడ్డి తెలిపారు. గత నెల 29న జరిగిన గొడవలో అంచుపోగు భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదుతో వెలిచర్ల షారోన్‌కుమార్‌పై కేసు నమోదు చేయగా, షారొన్‌కుమార్ భార్య వెలిచర్ల హెప్సిబా గర్భంతో ఉన్న తనపై దాడి చేసి కొట్టారన్న ఫిర్యాదు మేరకు అంచుపోగు వాసు, భాస్కర్, సురేష్, వెంకట్రావు, సునీల్ తదితరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సీఎం, డిప్యూటీ సీఎంల చిత్రపటాల అందజేత

ఉలవపాడు, జూలై 3 : ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలను ఎన్‌డీఏ కూటమి నాయకులు బుధవారం అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు వెళ్లి అధికారులకు అందచేశారు. కూటమి నాయకులు అయ్యప్ప, మాబాషా, ఆంజనేయులు, డాక్టర్ పవన్, డాక్టర్ కరీం, ప్రసాదు, సుబ్రహ్మణ్యం, గుప్తా, నాగేశ్వరరావు, గిరి తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు చిత్రపటాలు అందచేస్తున్న నేతలు

ఘనంగా ఏఐఐఈఏ వార్షికోత్సవం

కందుకూరు, జూలై 3: ఆల్ ఇండియా ఇన్స్యూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) 74వ వార్షికోత్సవ వేడుకలను స్థానిక ఎల్ఐసీ బ్రాంచిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎల్ఐసీ సీనియర్ బ్రాంచి మేనేజరు ఐవీఏ కాంతారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత హోమియో, యునాని, ఆయుర్వేద వైద్యశిబిరాలు నిర్వహించారు. ఆయుర్వేద వైద్యురాలు డాక్టరు ఆర్బీఎస్ లక్ష్మీకుమారి, హోమియో వైద్యురాలు డాక్టరు పి.రత్నావళి, యునాని వైద్యురాలు కేవీ పద్మజాకుమారిలు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, ఆరోగ్య సలహాలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఏఐఐఈఏ ప్రెసిడెంట్ షేక్ షబ్బీర్, కార్యదర్శి విష్ణువర్ధనరెడ్డి, సభ్యులు డీవీ రమణ, లక్ష్మీనారాయణ, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

కావలి రూరల్, జూలై 3: యువత ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని 1వ పట్టణ సీఐ రాజేష్ హెచ్చరించారు. కావలి పట్టణంలో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 10వ తరగతి, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ట్రిబుల్ డ్రైవింగ్‌తో నడుపుతున్న 15 బైకులను పట్టుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల నడవడికలను గుర్తించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న 4 కళాశాలలపై నిఘా ఉంచామన్నారు. కొందరు యువకులు తమ కళాశాలలకు వెళ్లకుండా ఇతర కళాశాలల వద్దకు వెళ్లి విద్యార్థినుల చుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం రావడంతో కళాశాలల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు నిఘా ఉంచామన్నారు. ఎవరైనా ఆడపిల్లలను ఈవ్‌టీజింగ్ చేస్తూ తిరుగుతున్నట్లయితే ఫొటోలు తీసి పంపాలన్నారు. కళాశాల యాజమాన్యాలు కూడా విద్యార్థినులు కళాశాలకు వచ్చేటప్పుడు, కళాశాల నుంచి ఇళ్లకు వెళ్లేటప్పుడు గమనిస్తుండాలన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

బిట్రగుంట, జూలై 3: బోగోలు మండలం బిట్రగుంట పంచాయతీ కొండబిట్రగుంటలోని బండ్లవారి కాలనీలో పేదలకు బుధవారం రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పుట్టిన రోజును పురస్కరించుకున్ని దుప్పట్లు, పండ్లు, బన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎంఆర్ యువ నేస్తం నిర్వాహకులు షేక్ సమీఉల్లా, సమీమిత్ర బృందం ఖలీల్‌బాషా, శ్రీధర్‌రావు, షాకీర్, సుజీత్, ముత్తహర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీ ట్రైసైకిళ్లకు దరఖాస్తు చేసుకోండి

కందుకూరు, జూలై 3: కేంద్ర ప్రభుత్వ సంస్థలైన సీఆర్‌సీ, అలిమ్కో సంస్థల ద్వారా సక్షమ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు అవసరమైన బ్యాటరీ ట్రై సైకిళ్లు, వీల్‌చైర్స్ వినికిడి యంత్రాలు, చంక కర్రలు ఉచితంగా అందజేస్తున్నట్లు సక్షమ్ ప్రతినిధి చెన్నా రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సదరం కార్డు, యుడీఐడీ కార్డు, పాస్‌ఫొటోను ఈనెల 4వ తేదీ సాయంత్రంలోగా 9949334606 నెంబరుకు వాట్సాప్ చేయాలని ఆయన కోరారు. 60 ఏళ్లు పైబడిన వారికి సదరం కార్డుతో పనిలేకుండా వినికిడి యంత్రాలు, వీల్‌చైర్స్, చంకకర్రలు ఉచితంగా ఇస్తారని తెలిపారు. అవసరమైన వారు సంప్రదించాలని కోరారు.

నేడు సేవా కార్యక్రమాలు

కందుకూరు, జూలై 3: ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం కందుకూరులో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పామూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో కేకు కట్ చేసిన అనంతరం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తామని తెలిపారు. మధ్యాహ్నం కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణ స్వయం కృషి మానసిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు భోజనం, పట్టణంలో అనాథలు, యాచకులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఐఎన్ఆర్ అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

వాహ్..!

● ఆకట్టుకున్న దేవుళ్ల ఆకృతులు






రామతీర్థం బ్రహ్మోత్సవాల్లో భాగంగా వివిధ రకాల పండ్లతో తీర్చిదిద్దిన దేవుళ్ల ఆకృతులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. బియ్యం, ఉప్పుతోపాటు నిమ్మ, యాపిల్, జామ, ద్రాక్ష, ఇలా వివిధ రకాల పండ్లతో దేవుని ప్రతిమలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. ఆదిదంపతుల దర్శనం అనంతరం భక్తులు ఆ ప్రతిమలను సందర్శించారు.

- విడవలూరు

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి


రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు, జూలై 3 : నియోజకవర్గ ప్రజానీకానికి మెరుగైన వైద్యసేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఇనమడుగులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. స్థానిక వైద్యసిబ్బందితో చర్చించారు. వైద్యపరీక్షలకు సంబంధించి ల్యాబ్ టెక్నీషియన్లను ఆరా తీశారు. పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వసతి సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోవూరు మండలంలోని 80 వేల మంది ప్రజానీకానికి కేవలం ఒకేఒక్క పీహెచ్‌సీ మాత్రమే ఉందని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రెండో పీహెచ్‌సీ ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేదల పట్ల ఆదరణ చూపాలని, బాధ్యతాయుతంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. స్థానిక డాక్టర్లు ఆమె దృష్టికి తెచ్చిన సమస్యలపై స్పందిస్తూ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. దేశంలోనే ప్రతిష్ఠాత్మక నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్ గుర్తింపు సాధించిన విడవలూరు మండలంలోని రామతీర్థం పీహెచ్‌సీని ఆదర్శంగా తీసుకుని వైద్యసేవలు అందించాలన్నారు. స్థానిక సర్పంచ్, ప్రజా ప్రతినిధులు సైతం తరచూ ఆసుపత్రిని సందర్శిస్తూ ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి నిరంజన్, ఎంపీపీ పార్వతి, ఎంపీటీసీ కొల్లా సునీల్‌రెడ్డి, సర్పంచ్ ప్రమీలమ్మ, టీడీపీ నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, గుత్తికొండ వెంకయ్య, దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, జనసేన నాయకులు గుడి శ్రీహరిరెడ్డి, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు ఘన నివాళి


మునీంద్రబాబు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

వెంకటాచలం, జూలై 3: మండలంలోని ఎగువ మిట్ట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత పల్లిపాటి మునీంద్రబాబు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. కాగా, ఎగువమిట్ట గ్రామంలో బుధవారం నిర్వహించిన మునీంద్రబాబు ఉత్తరక్రియల్లో సర్వేపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పాల్గొని మునీంద్రబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, నాయకులు ముక్కు చంద్రశేఖర్, ఈపూరు శరత్‌నాయుడు, బద్వేలు చెన్న కిష్టయ్య, నలబాలపు వెంకటాద్రి, తదితరులున్నారు.

గ్రామసభ రసాభాస

తోటపల్లిగూడూరు, జూలై 3: వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, ఆరోపణలు ఎత్తిచూపడంతో గ్రామసభ రసాభసగా మారింది. మండలంలోని పాపిరెడ్డిపాలెంలో బుధవారం ప్రజా సమస్యలపై గ్రామసభ నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న స్థలాల కేటాయింపులో అసలైన లబ్ధిదారులకు ఇవ్వలేదని, భారీ అవినీతి, అక్రమాలు జరిగాయని ఆగ్రామ టీడీపీ నాయకులు స్థానిక సర్పంచ్ కదిరి వెంకటసుబ్బయ్యను నిలదీశారు. అవినీతి, అక్రమాల గురించి మాట్లాడితే తాటతీస్తానని సర్పంచ్ అనడంతో వారి అనుచరులు టీడీపీ నాయకులపై దాడులకు పాల్పడ్డారు. దీంతో గ్రామసభ రసాభసగా మారింది. గత ప్రభుత్వంలో అనేక అక్రమాలు చేసి ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీలో చేరి నాయకులపై దాడి చేయడం మంచి పద్ధతి కాదని టీడీపీ నాయకులు పేర్కొన్నారు.

43 మద్యం సీసాల స్వాధీనం

మనుబోలు, జూలై 3: అక్రమంగా తరలిస్తున్న 43 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అజయ్ కుమార్ బుధవారం తెలిపారు. మడమనూరు గ్రామానికి చెందిన పన్నెం వాసు అనే వ్యక్తి పలు మద్యం దుకాణాల నుంచి మద్యం కొనుగోలు చేసి గొలుసుదుకాణం నిర్వహించేందుకు మోటార్‌సైకిల్‌పై వెళుతున్నాడు. సమాచారం రావడంతో ఎస్‌ఐ తన సిబ్బందితో వాసుని వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద అదుపులోకి తీసుకుని అతని వద్దనున్న మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పబ్లిక్ స్థలం అమ్మేశారని ఫిర్యాదు

పొదలకూరు, జూలై 3: పట్టణంలోని రావులనగర్‌లోని పబ్లిక్ పర్పస్ స్థలాన్ని అమ్మేశారని మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన రావుల నారాయణగౌడ్ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమకు సంబంధించిన ఉమ్మడి లేఅవుట్‌లోని 356 అంకణాల ఖాళీ స్థలాన్ని చట్టపరంగా పార్కుకు కేటాయించామన్నారు. తమ అన్న రావుల దశరథరామయ్యగౌడ్ చట్ట విరుద్ధంగా ఆ స్థలాన్ని ప్లాట్లుగా విభజించి అమ్మేశారని వెల్లడించారు. ఆ పార్కు స్థలాన్ని పంచాయతీ అధికారులు స్వాధీనపరుచుకుని ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకువాలని విజ్ఞప్తి చేశారు.

ప్లాస్టిక్ కవర్లతో నిండిన సెంట్రల్ చానల్

● రైతుల ఆందోళన


ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయిన సెంట్రల్ చానల్

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 3: కనిగిరి రిజర్వాయర్ సదరన్ చానల్ నుంచి బుచ్చి, జొన్నవాడ రోడ్డు, చెల్లాయపాళెం మీదుగా కోవూరు చెరువుకు, కాలువ వెంబడి ఉప కాలువల ద్వారా వ్యవసాయ పొలాలకు సాగునీరందించే సెంట్రల్ ఛానల్ ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయింది. ఈ ప్లాస్టిక్ కవర్లు వ్యవసాయ పొలాల్లోకి వెళ్తే పంటలకు ముప్పు ఏర్పడుతుందని, సెంట్రల్‌ఛానల్‌తో పాటు పలు కాలువల్లో ఇదే దుస్థితి నెలకొందని, ప్లాస్టిక్ కవర్ల తొలగింపు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయాలి


రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ మౌనిక

మనుబోలు, జూలై 3: అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యసిబ్బంది క్రమం తప్ప కుండా చిన్నారులకు వ్యాక్సిన్ వేయాలని సర్వలెన్సు మెడికల్ అధికారిణి డాక్టర్ మౌనిక అన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆదేశాల మే రకు మండలంలోని మను బోలు, బద్దెవోలు గ్రామాల్లోని అంగన్‌వాడీల్లో జరు గుతున్న వ్యాక్సినేషన్ కా ర్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. పిల్లలకు మంచి పోషకాహారం అందించాలని ఆమె అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మనుబోలు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు మొహసీనా సుల్తానా, ఏఎన్‌ఎంలు సుబాషిణి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతకు నోచని మంచినీటి ట్యాంకులు

● రోగాల బారిన గ్రామస్థులు


ఈదూరులోని మంచినీటి ట్యాంక్

తోటపల్లిగూడూరు, జూలై 3: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మంచినీటి ట్యాంకులను శుభ్రపరచకపోవడంతో రోగాల బారిన పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. మండలంలోని 22 పంచాయతీల్లో 45 నీటి ట్యాంకులున్నాయి. ఇందులో అధిక శాతం మంచినీటి ట్యాంకుల నిర్వహణ విషయంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. తాగునీరు అందించే ట్యాంకులను నెలకు రెండు దఫాలుగా శుభ్రపరచాల్సి ఉంది. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా నెలకొకసారి కూడా శుభ్రతకు నోచుకోవడంలేదు. దీంతో కలుషిత నీరు సరఫరా అవుతోంది. ఈ నీటిని తాగిన ప్రజలు పలు రోగాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా మూలమూల గ్రామాలైన విలుకానిపల్లి, వరకవిపూడి, ఈదూరు, కోడూరు, తదితర గ్రామాల్లో పంచాయతీ ట్యాంకుల ద్వారా సరఫరా అవుతున్న నీరు తాగి ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు సరఫరాచేసే నీరు తాగలేక మినరల్ వాటర్ కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందని, ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మంచినీటి ట్యాంకులను శుభ్రపరచి తాగునీటిని అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆడపిల్లలపై అత్యాచారాలను అరికట్టాలి

● సీనియర్ సివిల్ జడ్జి వాణి



మహిళలతో మాట్లాడుతున్న న్యాయాధికారి వాణి

నెల్లూరు(వైద్యం), జూలై 3: ఆడపిల్లలపై జరిగే అత్యాచారాలను అరికట్టాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వాణి అన్నారు. బుధవారం నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న సఖి కేంద్రాన్ని ఆమె సందర్శించారు. అక్కడ ఉన్న మహిళలతో మాట్లాడారు. అత్యాచారానికి గురైన మహిళలకు వైద్య, న్యాయ సహాయానికి, మానసిక ఒత్తిడి నివారణకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు సఖి వన్‌స్టాప్ సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఆడపిల్లలపై జరిగే కుల, మత వివక్ష, లైంగిక వేధింపులు, వివాహితులపై జరిగే వేధింపులు, బాలల రక్షణ కోసం చట్టాలు ఉన్నాయన్నారు. అలాగే గృహహింస చట్టం కింద బాధితులకు ఉచిత కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. కోర్టు కేసులకు సంబంధించి న్యాయవాదిని పెట్టుకోలేని వారికి తామే న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ ఏవో షహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకే విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రాలు..?

● అందని వైద్యసేవలు ● రోగుల అవస్థలు


మినగల్లులోని విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రం

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 3: మండలంలో విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రాల్లో వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పెనుబల్లి, మినగల్లు, పంచేడు, చెల్లాయపాళెం, దామరమడుగు, కాశయకాగొల్లు, రేబాల, వవ్వేరు, నాగమాంబాపురం, ఇస్కపాళెంలో మొత్తం 12 విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రాలున్నాయి. ఇటీవల పలు గ్రామాలలో ప్రజలు వాంతులు, విరేచనాలు (డయేరియా) జ్వరాలతో బాధపడుతున్నారు. వీహెచ్‌సీలలో విధులు నిర్వహించే పలువురు ఎంఎల్‌హెచ్‌పీలు విధులకు సరిగా హాజరుకావడం లేదని, ఆర్‌ఎంపీ వైద్యులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని రోగులు వాపోతున్నారు. ఇప్పటికైనా పీహెచ్‌సీ వైద్యాధికారులు స్పందించి సక్రమంగా వైద్యసేవలందేలా చర్యలు తీసుకోవాలని గామస్థులు కోరుతున్నారు.






చెత్త పోసేస్తున్నారు!

డంపింగ్ యార్డులా పొట్టేపాళెం రహదారి

నగరం నుంచి జొన్నవాడ వెళ్లే మార్గం చెత్త కుప్పలతో నిండిపోతోంది. ఇరగాళమ్మ సంఘం దాటిన తర్వాత పొట్టేపాళెం వరకు రహదారి వెంబడి మురుగు, వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇతర ప్రాంతాల నుంచి తరలించిన చెత్తను ఇక్కడ రోడ్డు పక్కన పోసి డంపింగ్ యార్డుగా మార్చేస్తున్నారు. వీటి వల్ల తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. అసలే దోమల బెడద ఎక్కువై విష జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలుతున్న కాలంలో ఇలా చెత్త పోయడం ప్రజారోగ్యానికి మరింత ప్రమాదకరం.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

దర్గాలో అద్దెల వసూలుకు లీజు

● కాంట్రాక్టరుకు హక్కుల అప్పగింత


కాంట్రాక్టరుకు లీజు హక్కు పత్రాలు ఇస్తున్న వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ కుదావన్, తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 3 : నగరంలో రొట్టెల పండుగ జరిగే బారా షహీద్ దర్గాలో హుండీల సేకరణ, శాశ్వత దుకాణాల అద్దె వసూళ్లు, రొట్టెల పండుగ సందర్భంగా ఐదు రోజులు ఏర్పాటు చేసే తాత్కాలిక దుకాణాల అద్దెల వసూళ్లకు సంబంధించిన హక్కు లను కాంట్రాక్టరుకు అప్పగించారు. ఈ మేరకు కాంట్రాక్టరు షేక్ ఫైజల్ అహ్మద్‌కు వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, ఆడిటర్ షేక్ కుదావన్ బుధవారం పత్రాలు అందజేశారు.రాష్ట్ర వక్ఫ్‌బోర్డు గత నెల 20న విజయవాడలో 2024 - 25 సంవత్సరంలో 11నెలలపాటు బారాషహీద్ దర్గాలో హుండీలు, దుకాణాల అద్దె వసూలు హక్కుకు వేలంపాట నిర్వహించిం ది. నెల్లూరు జెండావీధికి చెందిన ఫైజల్ అహ్మద్ రూ.1,57,59,824కు పాట దక్కించుకున్నారు. అందులో 60 శాతం మొత్తం రూ.95,18,310 వక్ఫ్‌బోర్డుకు చెల్లించడంతో సదరు కాంట్రాక్టును షేక్ ఫైజల్ అహ్మద్‌కు ఖరారు చేస్తూ వక్ఫ్‌బోర్డు ఉత్తర్వులిచ్చింది. వాటిని బుధవారం కాంట్రాక్టర్‌కు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నగరపాలక సంస్థ అధికారుల సూచనల మేరకు దర్గా ప్రాంగణంలో తాత్కాలిక అంగళ్ల కేటాయించి అద్దెలు వసూలు చేసుకోవాలని వక్ఫ్‌బోర్డు ఉత్తర్వుల్లో పేర్కొంది.

● **హుండీల ఆదాయం రూ.1,45,850**

గతేడాది కాంట్రాక్టు పొందిన వ్యక్తి లీజు హక్కు ఈ ఏడాది మే 22కు ముగియడంతో బారాషహీద్ దర్గాలోని హుండీలను వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టరు స్వాధీనం చేసుకున్నారు. కొత్త కాంట్రాక్టరుకు లీజు హక్కులను బుధవారం అప్పగించినందున దర్గాలోని హుండీలను లెక్కించారు. మే 22 నుంచి జూలై 3వతేదీ వరకు 40రోజులకుగాను రూ.1,45,850 ఆదాయం వచ్చిందని వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ కుదావన్ తెలిపారు. హుండీల్లోని కానుకల లెక్కింపులో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, పోలీసు అధికారులు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

అటవీ కార్యాలయానికి చంద్రబాబు, పవన్ చిత్రపటాలు


ఫారెస్ట్ అధికారులకు చంద్రబాబు, పవన్ చిత్రపటాలను అందచేస్తున్న గునుకుల కిషోర్

నెల్లూరు(క్రైం), జూలై 3 : అటవీ శాఖ జిల్లా కార్యాలయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలను జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ బుధవారం బహూకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి మహేష్‌శర్మ, నాయకులు వినయ్, మనోజ్, సూర్య, దుర్గ, సురేష్, ప్రశాంత్‌గౌడ్, మహేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'వాత్సల్య'కు రూ.50 వేల విరాళం


వాత్సల్య కార్యదర్శి సాంబశివరావుకు విరాళం చెక్కు అందచేస్తున్న డాక్టర్ శ్రీనివాసరాజు దంపతులు

నెల్లూరు(హరనాథపురం), జూలై 3 : నగరంలోని కిమ్స్ ఆసుపత్రి గుండె వ్యాధుల విభాగం చీఫ్ డాక్టర్ సీఎస్ శ్రీనివాసరాజు దంపతులు నగరంలోని వాత్సల్య అనాథాశ్రమానికి రూ.50 వేలు విరాళం అందచేశారు. వైద్యుడి జన్మదిన వేడుకలను బుధవారం ఆశ్రమంలోని చిన్నారుల మధ్య జరుపుకున్నారు. పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఆశ్రమానికి ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ 13 ఏళ్లగా వాత్సల్య చిన్నారుల మధ్య పుట్టిన రోజు జరుపుకుంటున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో 'వాత్సల్య' ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి హరిబాబు, ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రొట్టెల పండుగ ఏర్పాట్ల పరిశీలన


ఘాట్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జనసేన నాయకులు

నెల్లూరు (స్టోన్ హౌస్‌పేట), జూలై 3 : బారా షహీద్ దర్గాలో ఈనెల 17 నుంచి జరగనున్న రొట్టెల పండుగకు సంబంధించిన ఏర్పాట్లను జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు పార్టీ నాయ కులతో కలిసి బుధవారం పరిశీలించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. వైసీపీ హయాంలో చేసిన పనులన్నీ నాసిరకంగా ఉన్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఆలియా, నగర ప్రధాన కార్యదర్శులు షేక్ కరీం, శనివారపు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మూలస్థానేశ్వర ఆలయ ఇన్‌చార్జి ఈవోగా శ్రీనివాసరావు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 3 : నగరంలోని మూలాస్థానేశ్వర స్వామి ఆలయానికి ఇన్‌చార్జి ఈవోగా దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. అలాగే, మూలాపేట శ్రీకృష్ణ ధర్మ రాజులుస్వామి ఆలయం, పూడిపర్తి గ్రూప్ ఆలయాలకు ఇన్‌చార్జి ఈవోగా దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు స్వీకరించారు. ఆయా ఆలయాలకు ఈవోలుగా పనిచేసిన ఆరంబాకం వేణుగోపాల్, ఆర్ వెంకటేశ్వర్లు, రవీంద్రరెడ్డి గత 30న ఉద్యోగ విరమణ పొందడంతో ఇన్‌చార్జులను నియమించారు.

కలెక్టర్‌ను కలిసిన కార్పొరేషన్ అధికారులు


కలెక్టర్ హరినారాయణన్‌తో ఎంహెచ్‌వో వెంకట రమణయ్య

నెల్లూరు(సిటీ), జూలై 3 : జిల్లా కలెక్టర్‌గా పని చేస్తూ తాజాగా బదిలీ అయిన ఎం హరినారాయణన్‌ను కార్పొరేషన్ అధికారులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సిటీ ప్లానర్ దేవీకుమారి, ఎంహెచ్‌వో డాక్టర్ వెంకట రమణయ్య కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. అందరూ సంపూర్ణ సహకారం అందించడం వల్ల ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేశామని ఈ సందర్భంగా హరినారాయణన్ వ్యాఖ్యానించారు.

కేంద్ర మంత్రిని కలిసిన యశ్వంత్‌సింగ్


కేంద్ర మంత్రితో యశ్వంత్‌సింగ్

నెల్లూరు(క్రైం), జూలై 3: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడును ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం తరఫున నెల్లూరు జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి యశ్వంత్ సింగ్ బుధవారం కలిశారు. బొందిలి కులాన్ని ఓబీసీ కేటగిరిలో కలపాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

పాస్టర్స్‌కు గౌరవ వేతనం కొనసాగించాలి

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 3 : చర్చి పాస్టర్లకు ఇస్తున్న గౌరవ వేతనాన్ని నూతన ప్రభుత్వం కొనసాగించాలని పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం హనోక్ కోరారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. క్రైస్తవులందరికీ భారతీయ క్రైస్తవ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కేఎస్ రాజు, సదాశివరావు, ప్రధాన కార్యదర్శి ఏ రమేష్, కోశాధికారి కిషోర్‌కుమార్, సహాయ కార్యదర్శులు శ్యామ్‌ప్రసాద్, సుధీర్ పాల్గొన్నారు.

రేషన్ కోసం ప్రజల పాట్లు


రేషన్ కోసం చవటపాళెంకు కాలినడకన వెళ్తున్న ప్రజలు

వెంకటాచలం, జూలై 3: మండలంలోని చవటపాళెం పంచాయతీ ఎర్రగుంట, అబ్బిసాహెబ్ కండ్రిగ గ్రామాల ప్రజలు రేషన్ సరుకుల కోసం పడే పాట్లు వర్ణణాతీతం. ఎర్రగుంట, అబ్బిసాహెబ్ కండ్రిగ గ్రామాల్లో సుమారు 300 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరు కొన్నేళ్లుగా పంచాయతీ కేంద్రమైన చవటపాళెంలో రెండు రేషన్ దుకాణాలు ఉండగా అక్కడికి వెళ్లి సరుకులు తీసుకోవాల్సి ఉంది. అయితే చవటపాళేనికి అబ్బిసాహెబ్ కండ్రిగ, ఎర్రగుంట గ్రామాలు సుమారు 3 కిలోమీటర్లకు పైగా ఉంటాయి. దీంతో వీరు రేషన్ బియ్యం కోసం పెట్టే నగదు కన్నా, వీరి రాకపోకలకు రూ.40 రుపాయలకుపైగా ఖర్చు అవుతున్నాయి. చవటపాళెం గ్రామానికి వెళ్లేందుకు ఎలాంటి బస్సు సౌకర్యం లేదు. ఈ రెండు గ్రామాల ప్రజలు రేషన్ కోసం ప్రతి నెలా ఆటో బాడుగకు మాట్లాడుకుని సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రేషన్ బియ్యం కన్నా చార్జీలే ఎక్కువగా అవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు రేషన్ సరుకుల కోసం ఆటోలో కాకుండా పిల్లలను తీసుకొని కాలినడకన నడుచుకుంటూ చవటపాళెంకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకుంటున్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం అయినా తమ బాధలను గుర్తించి, ప్రత్యేక చొరవ తీసుకుని రేషన్ కష్టాలను తీర్చాలని, చవటపాళెం నుంచి తమ రెండు గ్రామాలకు కలిపే ఎర్రగుంట వద్ద రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
తిరుపతి
జిల్లా వార్తలు
గురువారం 4 జూలై 2024

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట : 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు : 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు : 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి : 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు : 99890 59755

కార్పొరేషన్ రోడ్డుకు పెద్దిరెడ్డి గేట్లు !

దగ్గరదారికోసం తెరవాలంటున్న రెండు కాలనీల జనం



కార్పొరేషన్ రోడ్డుకు అడ్డుగా పెట్టిన గేట్లు

తిరుపతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ నిధులతో 18వ డివిజన్ పరిధిలో మారుతీనగర్- రాయల్ నగర్ ప్రాంతాలను కలుపుతూ వేసిన రోడ్డు అందుబాటులో లేక మూడున్నరేళ్లుగా ప్రజలు ఎదురు చూస్తున్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి తన ఇంటి ముందు సామాన్య ప్రజలు ఎవరూ రాకపోకలు సాగించకూడదని రెండు వైపులా పెద్ద గేట్లు ఏర్పాటు చేసేశారు.వైసీపీ పాలనలో దాదాపు రూ.80లక్షల ప్రజాధనాన్ని వెచ్చించి పెద్దిరెడ్డి ఇంటి చుట్టూ సిమెంటు రోడ్లు వేశారు. మారుతీనగర్-రాయల్ నగర్ ప్రాంతాలను కలిపేందుకు సీసీ రోడ్డు వేస్తున్నట్టు రూ9.55లక్షల అంచనాతో (ఐఎఫ్‌బి నెం45/19-20)ఒకటి, రూ9.50లక్షలతో (ఐఎఫ్‌బి నెం.46/19-20) మరొకటి రెండు విడతలుగా నామినేటెడ్ కింద టెండరిచ్చారు.నాణ్యతలో ఏమాత్రం రాజీపడకుండా సిమెంట్‌రోడ్డును వేశారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు రాయల్‌నగర్ నుంచి మారుతీనగర్‌ను కలుపుతూ రోడ్డు వేస్తున్నట్టు కార్పొరేషన్ రికార్డుల్లో నమోదైవుంది.ఆ వీధినుంచి ఈ వీధికి కొత్త రోడ్డుద్వారా దాదాపు 300 మీటర్లు ప్రయాణిస్తే సరిపోతుంది. లేదంటే కిలోమీటరుకు పైగా చుట్టుకుని వెళ్లాల్సి వుంటుంది.కానీ రోడ్డు వేసిందే తడవుగా మాజీ మంత్రి ఇరువైపులా రెండు బలమైన గేట్లు పెట్టించేశారు.ఆయనతో పాటు వారి అనుచరుల వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది. మంత్రి ఇంటి సమీపంలో వున్న బండారు ఆంజనేయస్వామి ఆలయానికి పక్కన రోడ్డుకు రూ9.71 లక్షల (ఐఎఫ్‌బి నెం:170/19-20) అంచనాతో ఒకటి, ఆలయానికి దక్షిణం వైపు రోడ్డు రూ9.90లక్షల అంచనాతో ఒకటి (ఐఎఫ్‌బి నెం:205/19-2), దీంతోపాటు రూ4.65లక్షలతో 8-49/1 నుంచి ఎయిర్‌బైపాస్ రోడ్డుకు చేరేలా మరో రోడ్డు పనులకు అంచనా వేసి నామినేషన్ కింద టెండరిచ్చి ఆగమేఘాల మీద పనులను పూర్తిచేశారు.ఈ మూడు రోడ్లు స్థానికులకు అందుబాటులో వున్నాయి.పెద్దిరెడ్డి గేట్లు వేసి మూసేసిన రోడ్లుకూడా అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.ఈ విషయమై గత సోమవారం జరిగిన గ్రీవెన్స్ డేలో టీడీపీ నేతలు కమిషనర్‌కు వినతిపత్రం కూడా అందజేశారు.

జగనన్న భూరక్ష
రైతులకు శిక్ష



జగనన్న భూరక్ష పేరుతో వేసిన సర్వేరాయి

శ్రీకాళహస్తి, జూలై 3: జగనన్న భూరక్ష పేరుతో గత ప్రభుత్వం చేసిన రీసర్వే రైతుల పాలిట శిక్షగా మారింది. అనాలోచిత నిర్ణయాలతో గత పాలకులు చేసిన ఎల్‌టీపీఎం విధానం కారణంగా చాలా చోట్ల భూముల లావాదేవీలు స్తంభించిపోయాయి. దీంతో అవసరాలకోసం అమ్ముకోవాలనుకుంటున్న అన్నదాతలు ఆ వీల్లేక ఆవేదన చెందుతున్నారు.అనాదిగా భూముల లావాదేవీలు ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్న విషయం తెలిసిందే. గత ప్రభుత్వం వైఎస్ఆర్ జగనన్న భూరక్ష పేరుతో రీసర్వే చేస్తామంటూ ప్రకటించి ముందుగా కొన్ని పంచాయతీలను ఎంపిక చేసింది. ప్రజా ధనం వెచ్చించి మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన పేరుతో సర్వేరాళ్లను సిద్ధం చేశారు.కొన్ని పంచాయతీల్లో రీసర్వేలు చేశారు. గతంలో ఉన్న సర్వే నెంబర్లు, ఫీల్డ్ మ్యాప్‌లను రీసర్వే పేరుతో పక్కన పెట్టారు. ఆయా గ్రామాల్లోని రైతులకు సర్వే నెంబర్లకు బదులుగా ఎల్‌పీఎం నెంబర్లను కేటాయించారు.దశాబ్దాలుగా కొనసాగుతున్న భూముల విస్తీర్ణాన్ని ఆన్‌లైన్‌లో గందరగోళంగా మార్చేశారు. ఒక రైతుకు ముందున్న భూమి విస్తీర్ణం కన్నా పెంచడం లేదా తగ్గించేయడం చేశారు. భూముల కొలతలు తగ్గిపోయిన రైతులు మొత్తుకున్నా పట్టించుకోకుండా ఆన్‌లైన్‌లో రికార్డులు మార్చేశారు. మరికొందరికి ఉన్న భూమి కన్నా ఎక్కువ విస్తీర్ణం నమోదు చేశారు. గతంలో ఎవరైనా స్కెచ్ కోసం దరఖాస్తు చేసుకుంటే అధికారులు వెంటనే ఇచ్చేవారు. రీసర్వే తరువాత ఎవరి భూములకూ స్కెచ్ ఇచ్చేందుకు వీల్లేకుండా చేశారు. భూముల లావాదేవీలు స్తంభించిపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. శ్రీకాళహస్తి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో సుమారు 15 గ్రామాల్లో జగనన్న భూరక్ష సర్వే జరిగింది. ఆయా చోట్ల చాలామంది రైతులు కొద్ది నెలల క్రితం పిల్లల చదువులు, పెళ్లిళ్ల ఇతర అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో తమ భూములను విక్రయించుకున్నారు. కొద్ది నెలల వ్యవధితో ఒప్పందం పత్రం రాసుకుని విక్రయించారు. ప్రస్తుతం అలాంటి విక్రయ ఒప్పందాలు రిజిస్ట్రేషన్‌కు దగ్గర పడ్డాయి. ఇలాంటి వారు భూములు రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. రీసర్వే జరిగిన గ్రామాల్లో ఎల్‌పీఎం నెంబర్లు కేటాయించడం అది ఆన్‌లైన్‌లో అస్తవ్యస్తంగా నమోదు కావడం.. ఆ తరువాత ప్రభుత్వం మారిపోవడంతో చిక్కులు ఏర్పడ్డాయి. పాత సర్వే నెంబర్లు లేకుండా ఎల్‌పీఎం నెంబర్లు ఉండడం.. దానికి కూడా డిజిటల్ లాక్ అడ్డుగా ఉండటంతో రిజిస్ట్రేషన్లు చేసేందుకు వీల్లేకుండా పోతోంది.ప్రస్తుతం అత్యవసరం కోసం తమ భూములు అమ్ముకోవాలనుకునే వారికి ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది.



ఊరించి.. ఉసూరుమనిపించి...

ఉపరితలద్రోణి ప్రభావంతో బుధవారం పగలంతా ఉష్ణతాపం వేసవిని తలపించింది. అయితే సాయంత్రం ఆకాశం మేఘావృతమైంది. కరిమబ్బులు నలువైపులా విస్తరించి హోరుగాలులు మొదలయ్యాయి.భారీ వర్షం కురుస్తుందని జనం భావించారు. అయితే తిరుపతి పడమర దిశలో తేలిగ్గా కురిసిన వాన మిగిలిన ప్రాంతాలలో ఊసేలేకుండాపోయింది.భారీ వర్షం కురిసి వాతావరణం చల్లబడుతుందనుకున్న జనం కరిమేఘాలు చూస్తుండగానే మాయమైపోతుండడం చూసి నిరాశ చెందారు.

- తిరుపతి అర్బన్

ఇన్‌చార్జి డీపీవోగా సుశీలాదేవి



తిరుపతి(కలెక్టరేట్), జూలై 3: తిరుపతి జిల్లా గ్రామ పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్‌రెడ్డిని బదిలీ అయ్యారు.అనంతపురం జిల్లా డ్వామా శాఖలో గుత్తి క్లస్టర్‌కు ఏపీడీగా తిరిగి రిపోర్టు చేసుకోవాలని ఆయనకు ఆదేశాలందాయి. ఆయన స్థానంలో డీఎల్‌డీవోగా పని చేస్తున్న సుశీలాదేవికి అదనపు బాధ్యతలు అప్పగించారు.పంచాయతీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సుశీలాదేవి తెలిపారు.



గూడూరు-రేణిగుంట మూడవ రైలు మార్గం భూసేకరణకు నోటిఫికేషన్ జారీ

తిరుపతి(సెంట్రల్), జూలై 3: గూడూరు-రేణిగుంట రైల్వే జంక్షన్ల మధ్య మూడవ రైలు మార్గం ఏర్పాటుకు అవసరమైన భూసేకరణకు రైల్వే మంత్రిత్వశాఖ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ రెండు స్టేషన్ల మధ్య 83.17 కిలో మీటర్లు దూరం వుంది.తిరుపతి జిల్లా పరిధిలో అధికారులు భూసేకరణ చేసి రైల్వే శాఖకు అప్పగించాల్సి వుంది. ఈ మార్గంలో రోజురోజుకూ సాధారణ రైళ్ల రాకపోకలతో పాటు వస్తు రవాణా చేసే గూడ్స్ రైళ్ల సంఖ్య కూడా పెరుగుతుండడంతో మూడవ రైలు మార్గం ఏర్పాటు చేయాలని రైల్వే బోర్డు నిర్ణయించింది.ఈ మార్గం ఏర్పడితే స్టేషన్ల బయట రైళ్లు వేచి ఉండాల్సిన అవసరం ఉండదు.

16 కిలోల గంజాయి స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జులై 3: పార్శిల్ , కొరియర్ సర్వీసులు,లగేజీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో బుధవారం తనిఖీలు చేపట్టిన పోలీసులు 16కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.అదనపు ఎస్పీ కులశేఖర్ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బలగాలు తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండు, కొరియర్ సర్వీసుల ఆఫీసులు, రైల్వే పార్శిల్ కార్యాలయాలు, నవత, భారత్ మోటారు పార్శిల్ సర్వీసు కార్యాలయాలు, రేణిగుంటలోని స్టాకు పాయింట్లు, అనుమానిత పార్శిల్ సర్వీసులను తనిఖీ చేశారు.



పోలీసులు సీజ్ చేసిన గంజాయి

నేడు కలెక్టర్ బాధ్యతల స్వీకారం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 3: తిరుపతి జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ వెంకటేశ్వర్ గురువారం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని 11.46గంటలకు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. బుధవారం సాయంత్రం వెంకటేశ్వర్ కుటుంబ సమేతంగా తిరుపతికి చేరుకున్నారు. ఇన్‌ఛార్జి కలెక్టర్ ధ్యానచంద్ర, డీఆర్వో పెంచలకిషోర్,ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి తదితరులు ఆయనకు విమానాశ్రయంలో స్వాగతం పలికారు.



కలెక్టర్ వెంకటేశ్వర్‌కు స్వాగతం పలుకుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ ధ్యానచంద్ర

హడలెత్తించిన జెర్రిపోతులు

తిరుమల, జూలై3(ఆంధ్రజ్యోతి):తిరుమలలో బుధవారం రెండు భారీ జెర్రిపోతులు హడలెత్తించాయి. జీఎన్సీకి సమీపంలో హెచ్‌వీసీ కాటేజీ వద్ద వున్న ఎలక్ట్రికల్ జనరేటర్ వద్దకు సుమారు ఆరడుగుల పొడవున్న రెండు పాములు వచ్చాయి. వీటిని గుర్తించిన భక్తులు భయంతో పరుగులు తీశారు. వెంటనే అతిథిగృహాల సిబ్బంది టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కరనాయుడికి సమాచారమిచ్చారు. ఆయన అక్కడికి చేరుకుని పాములను పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.

వైసీపీ ప్రభుత్వంలో
అంతా అవినీతే

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యేల ధ్వజం

సంక్షేమ పథకాలన్నీ ఆ పార్టీ కార్యకర్తలకే

అధికారులపై ప్రశ్నల వర్షం



సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు

చిత్తూరు రూరల్, జూలై 3: వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి రాజ్యమేలిందని ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. ఐదేళ్లలో ఎప్పుడూ జరగనివిధంగా బుధవారం జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. కొత్త ఎమ్మెల్యేలైనా అధికారులను గుక్కతిప్పుకోనీయకుండా గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, జరగని అభివృద్ధిపై నిలదీశారు. ఉదయం 11 గంటలకు జరగాల్సిన సమావేశం మొదట కోరానికి కావాల్సి సభ్యులు రాకపోవడంతో కాసేపు వాయిదా వేశారు. మెల్లగా 28 మంది వరకు జడ్పీటీసీ సభ్యులు హాజరుకావడంతో సమావేశాన్ని మొదలు పెట్టారు. సమావేశం మొదలైన కాసేపటికే చిత్తూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు, చంద్రగిరి ఎమ్మెల్యేలు సమావేశానికి వచ్చారు. వచ్చీ రాగానే అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. వీరి ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు నిల్చుండిపోయారు. 2 గంటలకు ముగియాల్సిన సమావేశం సాయంత్రం 4 గంటల వరకు సాగింది. ఇది సర్వసభ్య సమావేశాన్ని తలపించింది.

సీఎం చంద్రబాబు చిత్రపటం ఎక్కడ?



ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించి 20 రోజులు కావస్తున్నా చిత్రపటాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని ఏర్పేడు జడ్పీటీసీ తిరుమలయ్య ప్రశ్నించారు. సమావేశం మొదలు కాగానే.. సీఎం చిత్రపటం లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలను హాలులో ఏర్పాటు చేయాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈవో గ్లోరియాను కోరారు. ఆ తర్వాత అధికారులు సీఎం చంద్రబాబు చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. జడ్పీటీసీ సభ్యులైనప్పటికీ తమ పేర్లను శిలాఫలకాల్లో అధికారులు వేయడం లేదని, తిరిగి తమ పేర్లతో ఉన్న నూతన ఫలకాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

పెండింగ్ బిల్లుల్ని విడుదల చేయండి



గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన పనులకు కేవలం ఆ పార్టీ వారనే కారణంగా కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వలేదు. వడ్డీలకు తెచ్చి పనులు చేస్తే బిల్లులు ఆపేస్తే ఎలా? వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ విడుదల చేయాలి. గత ఐదేళ్లలో చిత్తూరు నియోజకవర్గంలో ఎక్కడ చూసినా అవినీతి, అక్రమాలు తప్ప అభివృద్ధి జరగలేదు. ఇకనైనా క్రమశిక్షణతో అభివృద్ధి చేయకపోతే మేముగానీ, సీఎంగానీ ఒప్పుకొనే పరిస్థితి లేదు.

- గురజాల జగన్మోహన్, చిత్తూరు ఎమ్మెల్యే

పసుపు కండువాతో వైసీపీ జడ్పీటీసీలు

ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన ముగ్గురు వైసీపీ జడ్పీటీసీలు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి పసుపు కండువాలతో హాజరయ్యారు. వీరిలో తిరుమలయ్య (ఏర్పేడు), వెంకట సుబ్బారెడ్డి (శ్రీకాళహస్తి), పి.అర్చనదేవి (తొట్టంబేడు) ఉన్నారు.

- అలాగే, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం కుమారుడు నారాయణవనం జడ్పీటీసీ సుమన్ తనతో పాటు సత్యవేడు, కేవీబీపురం, వరదయ్యపాళ్యం, బీఎన్ కండ్రిగ జడ్పీటీసీలతో కలిసి సమావేశానికి హాజరయ్యారు.



కొండలు, గుట్టలూ వదల్లేదు



జీడీనెల్లూరు నియోజకవర్గంలోని రైతులకు నాణ్యమైన విద్యుత్తు అందక మోటార్లు, స్టార్టర్లు కాలిపోతున్నాయి. రైతులకు నాసిరకం కరెంటు ఇచ్చి.. క్వారీలకు, గ్రానైట్ ఫ్యాక్టరీలకు మాత్రం 24 గంటలూ నాణ్యమైన విద్యుత్తు సరఫరా అందిస్తున్నారు. సబ్‌స్టేషన్లలో పనిచేసే షిఫ్ట్ ఆపరేటర్లు చాలా మంది రాత్రిళ్ల మద్యం తాగి పడుకుంటున్నారు.కృష్ణాపురం ప్రాజెక్టును మరమ్మతు చేయకుండా దీనికి అరకిలోమీటరు కూడా లేని కత్తెరపల్లి ప్రాజెక్టును రూ.84 కోట్లతో మంజూరు చేయడం దారుణం. కేవలం కమీషన్ల కోసమే మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఇలా చేశారు. చెరువులు, ప్రభుత్వ భూములు, కొండలను సైతం నారాయణస్వామి వదిలిపెట్టలేదు.వైద్య ఆరోగ్య శాఖలో పోస్టులన్నీ కూడా మాజీ మంత్రి పెద్దిరెడ్డి నియోజకవర్గం, వైసీపీ కార్యకర్తలకు కేటాయించారని సమాచారం ఉంది. దీనిపై పూర్తి వివరాలను అందించాలి.

- థామస్, జీడీనెల్లూరు ఎమ్మెల్యే

కాంట్రాక్టు ఉద్యోగాలన్నీ పెద్దిరెడ్డి, చెవిరెడ్డి వర్గాలకే



జిల్లాలోని పలు శాఖల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలన్నీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అనుచరులకే కేటాయించారు. డీఆర్డీఏలో ఇప్పటికీ పలు హోదాల్లో ఉంటూ కొందరు వైసీపీ సర్వేల కోసం పనిచేశారు. తుడాలో కాంట్రాక్టు లేబర్ పేరుతో 60 మందికి పైగా చెవిరెడ్డి ఇంటి వద్ద పీఆర్వోలుగా, వైసీపీ సంబంధించిన పనులు చేస్తున్నారు. వీళ్లకు ఇప్పటికీ తుడా నుంచి జీతాలు అందుతున్నాయి. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట చెరువులో అభివృద్ధి పేరిట రూ.వంద కోట్ల తుడా నిధులతో చెవిరెడ్డి భారీ స్కాం చేశాడు. నేను అభివృద్ధికి వ్యతిరేకం కాదు. కానీ, ఆ చెరువులో పార్కులు, కట్టడాల వల్ల గతంలో కురిసిన వర్షాలకు అవిలాల, సాయినగర్, గాంధీపురం, ఓటేరు, పేరూరు ప్రాంతాల్లో వరద ప్రవహించి దెబ్బతిన్నాయి. చెరువులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదన్న నిబంధనలున్నా.. తుమ్మలగుంట చెరువులో మాత్రం ఈ పనులకు నిధులు ఎలా విడుదల చేశారు? వీటికి బాధ్యులైన అధికారులను సస్పెండు చేయాలి. ఇక, మామండూరు జగనన్న కాలనీలో చెవిరెడ్డి దగ్గర పనిచేసే గన్‌మ్యాన్, పీఆర్వోలు, వైసీపీ నాయకులకు వారి బినామీ పేర్లతో ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలి. తిరుపతి రూరల్‌కు తెలుగు గంగ నీటి సరఫరా కోసం గతంలో ఇచ్చిన జీవోను అమలు చేసి కొత్తగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలి. అలాగే కార్యదర్శులతో చెవిరెడ్డి కాన్ఫరెన్స్‌లోకి తీసుకొని మాట్లాడటంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి.

- పులివర్తి నాని, చంద్రగిరి ఎమ్మెల్యే

ఐదేళ్లలో అభివృద్ధినే మరిచారు



ఈ ఐదేళ్లలో పూతలపట్టు నియోజకవర్గంలో అభివృద్ధిని పట్టించుకోలేదు. కొన్ని గ్రామాల్లో తాగునీరు లేకుంటే, మరికొన్నిగ్రామాల్లో కాలువలు, రోడ్లు సరిగా లేవు. గడిచిన ఐదేళ్లలో రూ.126 కోట్లతో అభివృద్ధి చేసినట్లు రికార్డుల్లో చెబుతున్నా.. అవెక్కడా కనపడడం లేదు. కనీసం వారానికి ఒకసారి తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయడం లేదు. ప్రజలు డయేరియాతో అల్లాడిపోతున్నారు.గత ప్రభుత్వంలో ఐరాల మండలం, నాంపల్లి రెవెన్యూ గ్రామానికి చెందిన ఓ పిల్లవాడు 100 శాతం అంగవైకల్యంతో ఉన్నా ఏవో కారణాలు చూపి పింఛన్ ఇవ్వకపోవడంపై 'ఆంధ్రజ్యోతి'లో చదివి ఆశ్చర్యపోయా. ఇవన్నీ మారాలి లేదంటే మారుస్తా.

- మురళీమోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే

శ్మశానానికి దారి లేక మెట్టు గిరిజనుల కష్టాలు

- పైర్లు తొక్కుకుంటూ మృతదేహాన్ని మోసుకెళ్లాల్సిన దుస్థితి



పొలాల్లో మృతదేహాన్ని తీసుకెళ్తున్న గిరిజనులు

చిట్టమూరు, జులై 3: మండల పరిధిలోని మెట్టు గిరిజన కాలనీవాసులకు శ్మశానానికి దారి లేక మృతదేహాన్ని పొలాల గట్లపై, పైరును తొక్కుంటూ తీసుకెళ్లాల్సి దుస్థితి నెలకొంది. మెట్టులో ఎవరైనా మృతి చెందితే గ్రామానికి దగ్గర్లో ఉన్న స్వర్ణముఖి నదిలో అంత్యక్రియలు చేయాల్సి ఉంది. అయితే నదికి చేరుకోవాలంటే సుమారు రెండు కిలోమీటర్లు దూరం వెళ్లాలి. మృతదేహాన్ని మోసుకొని అంతదూరం వెళ్లడం ఇబ్బందిగా మారిందని గిరిజనులు వాపోతున్నారు. చేసేది లేక అడ్డదారిలో పొలాల గట్లపై, పంటలపై మోసుకెళ్తున్నామని వాపోయారు. బుధవారం గిరిజన కాలనీలో వ్యక్తి చనిపోతే పొలాల్లోనే మృతదేహాన్ని మోసుకొని వెళ్లారు. గత ప్రభుత్వంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ న్యాయం జరగలేదని వాపోయారు. నూతన ప్రభుత్వం స్పందించి శ్మశానానికి దారి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

సూళ్లూరుపేటలో వర్షం



కచ్చేరివీధిలో నిలచి ఉన్న వర్షపు నీరు

సూళ్లూరుపేట, జూలై 3: సూళ్లూరుపేట పరిసర ప్రాంతాల్లో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్ర ఎండ, ఉక్కపోతతో అల్లాడిపోయిన ప్రజలు సాయంత్రం నుంచి కారు మబ్బులు కమ్ముకొని చల్లని గాలులతో కూడిన తేలికపాటి తొలకరి జల్లుల వర్షం పడడంతో ఉపశమనం పొందారు. రాత్రి 9 గంటల నుంచి ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో జీఎన్‌టీ రోడ్డు, కూరగాయల మార్కెట్ సెంటర్ తదితర ప్రాంతాలు జలమయంగా మారాయి. పరిశ్రమల నుంచి, వివిధ ప్రాంతాల్లో పనులకు వెళ్లిన కార్మికుల ఈ వర్షంతో ఇబ్బందులు పడ్డారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



కోట, జూలై 3: పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో మస్తానయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం వండిన భోజనం, కూరలను రుచి చూశారు. మధ్యాహ్నభోజనంలో నాణ్యత పెంచాలని నిర్వాహకులను ఆదేశించారు. పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న నాడునేడు పనులను పరిశీలించి హెచ్ఎం సురేంద్రబాబుకు సూచనలు చేశారు.

మొండి బకాయిలు తక్షణం చెల్లించాలి



మరణ ధృవీకరణాలను ఆన్‌లైన్ చేస్తున్న స్త్రీనిధి మేనేజర్

కోట, జూలై 3: స్త్రీనిధి రుణాలు పొంది తిరిగి చెల్లించడంలో నిర్లక్ష్యం చేసిన పొదుపు సంఘాలను బ్లాక్ లిస్టులో పెడతామని స్త్రీనిధి మేనేజర్ జయకుమార్ హెచ్చరించారు. మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీ వావిళ్ల దొరువులో బుధవారం స్త్రీనిధి రుణాలపై పొదుపు సంఘాలతో సమీక్ష జరిగింది. సంఘాల వారీగా రుణాలు తీసుకున్న గ్రూపులు, తిరిగి చెల్లించని సంఘాలపై ఆరా తీశారు. అదే విధంగా రుణాలు పొంది మరణించిన సభ్యుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రుణాలు పొందేందుకు అర్హులైన పొదుపు సంఘాలను గుర్తించి మలివిడత లోన్లు పొందేందుకు బ్యాంకులకు నివేదికలు పంపామన్నారు. ఆయన వెంట సీసీ ప్రసాద్ ఉన్నారు.

ఆయాలకు స్టీల్ గిన్నెల పంపిణీ

కోట, జూలై 3: పట్టణంలోని స్త్రీశిశు సంక్షేమ కార్యాలయంలో బుధవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని 225 అంగన్‌వాడీ కేంద్రాలకు స్టీల్ గిన్నెలు, బూజు తుడిచే కర్రలు, పలు సామగ్రిని బుధవారం సూపర్‌వైజర్ అందజేశారు. సీడీపీవో మునికుమారి ఆదేశాల మేరకు ఆయా కేంద్రాల ఆయాలకు వాటిని అందజేశారు. అదే విధంగా సూపర్ వైజర్లు కృష్ణమ్మ, కవిత, శేషమ్మ, పద్మమ్మలు వాటిని వినియోగించే విధానంపై ఆయాలకు అవగాహన కల్పించారు.

చదువుతోనే ఉజ్వల భవిత



విద్యా కిట్ల పంపిణీలో టీడీపీ నాయకులు

గూడూరు, జూలై 3: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీడీపీ నాయకుడు ఇశ్రాయిల్ కుమార్ అన్నారు. బుధవారం జానకిరాంపేటలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు విద్యకు ప్రాధాన్యం ఇస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు, బోధన అందించేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విజయమ్మ, పురుషోత్తం, కల్యాణ్, వినయ్‌కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలి

గూడూరు అర్బన్, జూలై 3: గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేలా కృషి చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను బీజేపీ నాయకులు కోరారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను బీజేపీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు నాయకులు మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గం తిరుపతి జిల్లాలో ఉండడం కారణంగా జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ప్రజలు వ్యయప్రయాసలు పడాల్సి వస్తోందన్నారు. గతంలో మాదిరిగా గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపేందుకు కృషి చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో ఏ.బాలకృష్ణమనాయుడు, వీ.పురుషోత్తంరెడ్డి, పి.కోటేశ్వరరావు, గిరిధర్‌రెడ్డి, కృష్ణయ్య, కోటారెడ్డి, భైరప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష చేయలేదు

ఆరణి శివకుమార్

తిరుపతి, జూలై3(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను కమిషనర్ అదితిసింగ్ దృష్టికి తీసుకెళ్లేందుకే తాను కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లినట్టు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్న కుమారుడు శివకుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'తిరుపతిలో షాడో ఎమ్మెల్యే' అంటూ వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని వినతులను ఇచ్చేందుకు తాను మర్యాదపూర్వకంగా కమిషనర్‌ను కలిశానని, తాను అధికారులతో ఎలాంటి సమీక్ష నిర్వహించలేదని, ఎక్కడా కూడా ఆదేశాలు ఇవ్వలేదని చెప్పారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి



పారిశుధ్య కార్మికులకు దుస్తులు, సామగ్రి అందిస్తున్న ఎమ్మెల్యే

గూడూరు, జులై 3: పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు మరువలేనివని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు దుస్తులు, ఇతర సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... వేకువ ఝాము నుంచే పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోకుండా పారిశుధ్య పనులు చేపడుతూ ప్రజారోగ్యాన్ని కాపాడుతున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లుగా పారిశుధ్య కార్మికులకు దుస్తులు, సబ్బులు, ఇతర సామగ్రిని ఇవ్వక పోవడం దారుణమన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించిన సీఎం చంద్రబాబు వారికి దుస్తులను, ఇతర సామగ్రిని అందించారన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. వైసీపీ ప్రభుత్వంలో విందూరు హెడ్ వాటర్‌వర్క్స్‌లో మోటర్లు, బోర్లు మరమ్మతులకు గురైనా పట్టించుకోకపోవడంతో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తాయన్నారు. రెండు రోజులుగా తాగునీటి సరఫరా పైపులైన్ల మరమ్మతులు చేపడుతున్నామని, ఇకపై అంతరాయం లేకుండా నీరందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే పట్టణానికి రెండుపూటలా నీరందిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై విచారణ జరిపిస్తామన్నారు. టీడీపీ నాయకులు శీలం కిరణ్‌కుమార్, పి.శ్రీనివాసులు, చాన్‌బాషా, శివకుమార్, వెంకటేశ్వర్లురాజు, రవీంద్రరెడ్డి, నరసింహులు, పెంచలయ్య, జహంగీర్, సిద్దయ్యనాయుడు, భారతి, నాగరాజు, ఇశ్రాయిల్‌కుమార్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కదలని మురుగు... పడేనా మెరుగు!



గూడూరు దండోరా కాలనీలో దుస్థితి - చిల్లకూరు అరుంధతీయవాడలో మురుగు కదలని కాలువ- బోరు వద్ద అధ్వానంగా ఉన్న పరిసరాలు



గూడూరు నాయీ బ్రాహ్మణకాలనీలో...

గూడూరు, జులై 3: పట్టణంలోని పలు ప్రాంతాలలో డ్రైనేజీ కాలువలను అభివృద్ధి చేయకపోవడంతో రోడ్లపై మురుగు నిల్వచేరడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా రెండో పట్టణ పరిధిలోని దండోరా కాలనీ, నాయీ బ్రాహ్మణకాలనీ, ప్రశాంతినగర్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో పలు చోట్ల డ్రైనేజీ కాలువలను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచలేదని స్థానికులు చెబుతున్నారు. ఈ కాలనీల్లో సుమారు ఆరు వందలకు పైగా కుటుంబాలు నివాసముంటున్నాయి. ప్రధాన రహదారుల మినహా అంతర్గత రోడ్ల వద్ద డ్రైనేజీ కాలువలను నిర్మించకపోవడంతో మురుగు రోడ్లపైకి ప్రవహిస్తూ నిల్వచేరి మడుగులా మారుతోందని వాపోతున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమలతో ఇబ్బంది పడతున్నాయని వాపోయారు. ఈ కాలనీల్లోని కొన్ని ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు నిర్మించకపోవడంతో ఇటీవల కురుస్తున్న చిన్నపాటి వర్షాలకే వాన నీరు, మురుగు కలిసి రోడ్లుపై ప్రహిస్తుండడంతో బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు మురుగు నిల్వచేరకుండా చర్యలు తీసుకోవడంతోపాటు డ్రైనేజీ కాలువలను అభివృద్ధిపరచి ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

చిల్లకూరు: మండల కేంద్రంలో మురుగునీటి కాలువల్లో మురుగు ముందుకు కదలక నిల్వచేరి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. అరుంధతీయవాడలో సమస్య తీవ్రంగా ఉంది. అలాగే మురుగునీటి కాలువలు లేకపోవడంతో చేతిబోరు వద్ద నీరు నిల్వచేరి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. మూడు రోజుల క్రితం అరుంధతీయవాడలో ఐదుగురు అతిసారకు గురయ్యారు. దీంతో వడ్డిపాళెం, శంకరన్‌గిరిజకాలనీ, మిక్సిడ్ కాలనీ, దళితవాడలోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. శంకరన్ గిరిజన కాలనీలో కూడా దాదాపు ఇదే పరిస్థితి. కొన్ని చోట్ల మురుగులో పందులు సంచరిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

కాలుష్య కోరల్లో నీటి పథకం... పొంచివున్న ప్రమాదం



వ్యర్థాలతో నిండిన దేగలపాలెం చెరువు - చెరువులో ఉన్న నీటి పథకాలు

సూళ్లూరుపేట, జూలై 3: పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు తాగునీరందించే నీటి పథకాలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. పట్టణానికి ఉన్న నీటి వనరులు కళ్లడుటే కలుషితమవుతాఉన్నా అధికార యంత్రాంగంలో మాత్రం చలనం లేదు. దీని బాగోగులు చూడాల్సిన ఇంజినీరింగ్ అధికారులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.

సూళ్లూరుపేట పట్టణంతో పాటు కేసియన్ గుంట, మన్నెముత్తేరి పంచాయతీలకు కసారెడ్డిపాలెం సమీపంలో ఉన్న దేగలపాలెం చెరువులో నీటి పథకాలు ఏర్పాటు చేశారు. ఈ చెరువులో దాదాపు 10 బోరు పాయింట్లు వేసి అక్కడ నుంచి ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని నింపి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఉన్న 10 బోరు పాయింట్లలో రెండు చెరువులో పూడిపోయాయి. మిగిలిన 8 పాయింట్లలో 6 బోర్ల ద్వారా మున్సిపాలిటీ పరిధిలోని బాపూజీ కాలనీ, రాజీవ్‌నగర్, కోళ్లమిట్ట, ఇసుకమిట్ట, స్వతంత్రపురం, సోనియాగాంధీ నగర్, కసారెడ్డిపాలెం, కేఆర్‌పాలెంలకు తాగునీరు అందిస్తున్నారు. అంటే మున్సిపాలిటీ పరిధిలో సగభాగానికి పైగా ఈ చెరువులో ఉన్న నీటి పథకాల ద్వారానే తాగునీరు అందుతోంది. అదే విధంగా మండల పరిధిలోని కేసియన్ గుంట, మన్నెముత్తేరి పంచాయతీలకు కూడా రెండు బోరు పాయింట్ల ద్వారా సురక్షిత తాగునీరిస్తున్నారు. ప్రజల దాహార్తి తీర్చే దేగలపాలెం చెరువు కాలుష్య కోరల్లో చిక్కుకొంది. దీంతో చెరువులో వ్యర్థాలతో పాటు పిచ్చిచెట్లు దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు పలుచోట్ల చెరువులో పట్టణం నుంచి మురుగు కూడా కలుస్తోంది. చెరువులో పశువుల వ్యర్థాలు కూడా కలుస్తున్నాయి. వర్షాకాలంలో అయితే మురుగునీటి కాలువలు, రోడ్ల పై ప్రవహించే నీరంతా చెరువులోకి చేరుతున్నాయి. ప్రజల దాహార్తిని తీర్చే చెరువు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పలుమార్లు స్థానికులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని తెలుస్తోంది. ప్రజలకు తాగునీరందించే దేగలపాలెం చెరువు కాలుష్య కోరలనుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

ఆక్రమణల చెరలో విన్నమాల పంటకాలువ



ఆక్రమణలతో కుచించుకుపోయిన విన్నమాల పంటకాలువ

నాయుడుపేట, జూలై 3: నాయుడుపేట ఎల్ఏసాగరం నుంచి స్వర్ణముఖినదిలో ప్రారంభమయ్యే విన్నమాల పంటకాలువ పట్టణ నడిబొడ్డు నుంచి జాతీయ రహదారి, రైల్వే ట్రాక్‌ను దాటుకొని విన్నమాల చెరువుకు నదినీరు అందిస్తుంది. విన్నమాల పంటకాలువ దాదాపు 110 లింకులు వెడల్పుతో ఉండాల్సి ఉండగా నేడు ఆక్రమణలతో 50 అడుగుల మేర కుచించుకుపోయింది. విన్నమాల పంటకాలువ నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో ఎల్ఏసాగరం నుంచి ప్రారంభమై బీడీకాలనీ, టీచర్ కాలనీ, పాత ట్రెజరీ ఏరియా, పొగ గొట్టం కాలనీ, రజక కాలనీ, ఆకుతోట వీధి, ఎల్ఐసీ, ఆర్ముగం నగర్, ఆర్టీసీ బస్టాండ్ నుంచి జాతీయ రహదారి, రైల్వే ట్రాక్‌ను దాటుకొని విన్నమాల చెరువుకు చేరుతుంది. పంటకాలువ అంతా దాదాపు మున్సిపాలిటీ పరిధిలో ఉండటంతో అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో విన్నమాల పంటకాలువను మున్సిపాలిటీ, ఇరిగేషన్, రెవెన్యూ సంయుక్తంగా సర్వే నిర్వహించారు. ఆక్రమణలను తొలగించి రూ.38 కోట్ల తో ఆధునికీకరించేలా నివేదిక పంపారు. కార్యాచరణకు నోచుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాలువ ఆక్రమణలను తొలగించి విన్నమాల చెరువుకు నీరు చేరేలా చూడాల్సి ఉంది.

ఇండస్ పరిశ్రమ చేయూత అభినందనీయం



ప్లాంట్ ప్రారంభోత్సవం

నాయుడుపేట, జూలై 3: ఇండస్ కాఫీ పరిశ్రమ ద్వారకాపురంలో రూ.7.5 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినంద నీయమని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లోని ద్వారకాపురంలో టీడీపీ నాయకులు గాలి రాజేష్‌నాయుడు, గుంటూరు ప్రకాష్‌నాయుడు ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను నెలవల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మినరల్ వాటర్ ప్లాంట్ అందించిన ఇండస్ మేనేజింగ్ డైరెక్టర్ మణికి అభినందనలు తెలిపారు. మేనకూరు సెజ్‌లోని పరిశ్రమల యాజమాన్యాలు వారి వ్యాపార లావాదేవీల్లో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద 2 శాతం నిధులను సెజ్ కోసం భూములు కోల్పోయిన గ్రామాల్లో మౌలిక వసుతులకు కేటాయించాలని కోరారు. అలాగే కొన్ని గ్రామాలను పరిశ్రమలు దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇండస్ కాఫీ ఈడీ రవీంద్ర, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, కె.రమణారెడ్డి, నాయుడుపేట మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ రఫీ, టీడీపీ మండల అధ్యక్షుడు కె.అశోక్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో పోలీసు తనిఖీలు



సూళ్లూరుపేట, జూలై 3: సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో బుధవారం రాత్రి పోలీసులు తనిఖీలు చేశారు. వైజాగ్, హైదరాబాద్, విజయవాడల నుంచి వచ్చే రైళ్లలో గంజాయి, మత్తుపదార్థాలు తీసుకొచ్చి విక్రయాలు జరుపుతున్నారన్న సమాచారంతో డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ప్రయాణికులను తనిఖీ చేసి వారి వివరాలు సేకరించారు. గంజాయి రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు రైల్వేస్టేషన్, బస్టాండులో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. సీఐ మధుబాబు, ఎస్ఐ కోట రహీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలతో త్వరితగతిన కేసుల పరిష్కారం

వెంకటగిరి టౌన్, జూలై 3: కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టాలతో కేసులు త్వరితగతిన పరిష్కారమవుతాయని ఏపీపీ ప్రకృతి కుమార్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బాధితులు పోలీస్ సేషన్‌కు వెళ్లకుండానే ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చన్నారు. కేసు నమోదైన 14 రోజుల్లోనే కొలిక్కి తీసుకు వచ్చే విధంగా కొత్త చట్టం సూచిస్తుందన్నారు. పోలీసు దర్యాప్తుల్లో అనుసరించే సాంకేతిక, ఆధునాతన విధానాలు కేసు విచారణ సమయంలో దోహదపడుతాయని తెలిపారు. ఈ చట్టల వలన శిక్షలు పక్కాగా అములవుతాయన్నారు. దీంతో చోరీ, మోసం కేసుల్లో రికవరీకి పోలీసులకు పూర్తి స్థాయి అవకాశం కల్పించడంతో పాటు బాధితలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రజలు కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణానికి నిధులు కేటాయించండి



రైల్వే బోర్డు చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎంపీ వరప్రసాదరావు

గూడూరు, జూలై 3: పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించినట్లు మాజీ ఎంపీ వరప్రసాదరావు బుధవారం తెలిపారు. ఢిల్లీలో రైల్వేబోర్డు చైర్ పర్సన్ జయవర్మసింహ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి పలు సమస్యలను పరిష్కరించాలని విన్నవించామన్నారు. గూడూరు పడమర వైపు రైల్వే స్టేషన్‌లో నిర్మించిన రిజర్వేషన్ కౌంటర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని, ఎస్ఆర్ఏ టాకీస్ సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని, గూడూరు రైల్వేజంక్షన్‌లో వందేభారత్‌కు స్టాపింగ్ కల్పించాలని విన్నవించామన్నారు. అదేవిధంగా వాకాడు మండలం తీరప్రాంత గ్రామాలైన పూడిరాయిదొరవు, నవాబుపేట, చిన్నతోట తదితర గ్రామాల్లో సెల్‌ఫోన్ టవర్లు లేనికారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కేంద్రప్రభుత్వమే ముందుకు వచ్చి టవర్‌ను నిర్మిస్తే తీరప్రాంత ప్రజలకు సమాచార వ్యవస్థ అందుబాటులోకి వచ్చి ఉపయోగకరంగా ఉంటుందని డిజిటల్ కమ్యూనికేషన్ కమిషన్ చైర్మన్ నీరజ్‌మిట్టల్‌ను కలిసి విన్నవించినట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సహకారంతో కేంద్రప్రభుత్వం నుంచి ని ధులు తీసుకువచ్చి పలు అభివృద్ధిపనులు చేపట్టేలా చర్యలు తీసుకుం టామన్నారు.

పోలేరమ్మ ఆలయ హుండీ లెక్కింపు



వెంకటగిరి టౌన్, జూలై 3: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాతకోట వద్ద ఉన్న రామాలయంలో బుధవారం లెక్కించారు. మార్చి నుంచి 100రోజులకు గాను రూ.13,42,513 వచ్చిందని ఆలయ ఈవో ఏ.శ్రీనివాసులు రెడ్డి చెప్పారు. 3.5 గ్రాముల బంగారం, 84 గ్రాముల వెండి, 30 యూఎస్ డాలర్లు, 5 కువైట్ దినార్లు వచ్చాయని తెలిపారు. కార్యక్రమ పర్యవేక్షణ అధికారిగా దేవుని వెల్లంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి దేవస్థానం కార్యనిర్వాహక అధికారి ఎస్.శ్రీధర్ నాయుడు వ్యవహరించారు. ఇక లెక్కింపులో రెవెన్యూ, పోలీసులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన

చిల్లకూరు, జూలై 3: నూతనంగా అమల్లోకి వచ్చిన చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సుధీర్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని వరగలి క్రాస్ రోడ్డు సమీపంలో స్థానికులు, వాహనదారులు, ప్రయాణికులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా రక్షణ, మహిళాభద్రత, న్యాయాన్ని నిర్ధారించడం, నమ్మకాన్ని పెంచడం, సాధారణ పౌరుడిని శక్తివంతమైన పౌరుడుగా చేసే విధంగా నూతన చట్టాలు అమల్లోకి వచ్చాయన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగితే ఎవరైనా మృతిచెందితే దానికి కారణమైన వారికి 10 సంవత్సరాలు జైలు శిక్ష పడుతుందన్నారు. వాహన చోదకులు జాగ్రత్తగా వాహనాలు నడపాలన్నారు.

అనాథాశ్రమానికి చేయూత

నాయుడుపేట, జూలై 3: పట్టణంలోని ఎల్ఏసాగరంలోఉన్న చేయూత అనాథాశ్రమంలో షేక్ జాఫర్ జన్మదినం చేసుకున్నారు. విద్యార్థుల నడుమ కేక్ కట్ చేశారు. ఆశ్రమానికి అవసరమైన బియ్యం, పప్పు దినుసులు, నిత్యావసర సరుకులను అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సామంత్‌రెడ్డి, సన్నిస్‌రెడ్డి, రమేష్, కిరణ్, వెంకీ, ఆశ్రమ నిర్వాహకుడు టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సులో నగల చోరీ

నాయుడుపేట టౌన్, జూలై 3 : ప్రైవేట్ ట్రావెల్ బస్సులో బంగారు నగలు చోరీ జరిగినట్లు బాధితురాలు నాయుడుపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పశ్చిమ గోదావరిజిల్లా భీమవరానికి చెందిన మహిళ బెంగళూరుకు వెళ్లేందుకు ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఎక్కింది. బుధవారం ఉదయం 5 గంటలకు నాయుడుపేటకు చేరుకుంది. అదే సమయంలో ఆ మహిళ తన బ్యాగులో ఉంచిన 8 సవర్ల నగలు లేకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు సిబ్బందితో కలసి నాయుడుపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

నాయుడుపేట టౌన్, జూలై 3 : కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన చట్టాలలో మార్పులు చేయాలంటూ గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్ తెలిపారు. ఈమేరకు కక్షిదారులు, న్యాయవాద మిత్రులు సహకరించాలని ఆయన కోరారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కోట, జూలై 3: పట్టణంలోని క్రాస్‌రోడ్డులో మద్యం బెల్టు దుకాణానికి తరలిస్తున్న 40 మద్యం సీసాలను బుధవారం ఎస్ఐ నాగబాబు స్వాధీనం చేసుకున్నారు. వెంకటరమణయ్య అనే యువకుడు క్రాస్‌రోడ్డు నుంచి నెల్లూరుపల్లికొత్తపాళెంలోని బెల్టుదుకాణానికి తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అలాగే నిందితుడి బైక్‌ను స్వాధీని చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు పాశం విజయోత్సవ ర్యాలీ

వాకాడు, జూలై 3: ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఈనెల 4న వాకాడు మండలానికి విచ్చేస్తున్న సందర్భంగా కూటమి నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యానగర్ నుంచి టీడీపీ నాయకుడు చరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించనున్నారు. రంగన్నగుంట నుంచి బ్యారేజీ మీదుగా అశోక్‌పిల్లర్, బీసీ కాలనీ, గొల్లపాళెం వరకు భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానున్న ర్యాలీ కోసం టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, గూడూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, టీడీసీ సీనియర్ నాయకులు విజయశేఖర్‌రెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, కుంచం దయాకర్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బత్తిన ప్రమీల తదితరుల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

రైలు పట్టాలపై యువకుడి ఆత్మహత్య

నాయుడుపేట టౌన్, జూలై 3: మండలంలోని పండ్లూరు గ్రామ సమీపాన రైలు పట్టాలపై గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసుకొని మృతి చెంది నట్లు రైల్వే ఎస్ఐ కొండప్పనాయుడు తెలిపారు. యువకుడి వయసు 30 సంవత్సరాలు ఉంటుందని, గళ్లలుంగి, గళ్లచొక్కా ధరించి ఉన్నాడన్నారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారం లభించలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.